జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 198 విశాఖపట్నం | సోమవారం 04 ఏప్రిల్ 2022 | 8 పేజీలు | వెల : 5.00

## నేడు ఉదయం 9.05కు...

# 'కొత్త జిల్లాలు, కొత్త పాలన' ప్రారంభించనున్న జగన్




అమరావతి బ్యూరో : రాష్ట్రంలో కొత్త జిల్లాల పాలన మరికొన్ని గంటల్లో ప్రారంభం కాబోతుంది. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 9.05 నిమిషాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొత్త జిల్లాల పాలనను లాంఛనంగా ప్రారంభించబోతున్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సీఎం జగన్ పాలనను ప్రారంభించే సమయానికే రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల కలెక్టరేట్లలో కొత్త కలెక్టర్లు తమ జిల్లా పాలనను ప్రారంభించనున్నారు. ఆ దిశగా అవసరమైన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేశారు. అందుకు సంబంధించి శనివారం పొద్దుపోయాక గెజిట్‌ను కూడా విడుదల చేశారు. అంతకు ముందే ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలు కూడా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి దశల వారీగా డిఆర్వో, ఆర్డీఓ తదితర అధికారుల బదిలీలు కూడా చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలకు కొత్త సారథులతో సరికొత్త జిల్లా అధికార యంత్రాంగాన్ని శరవేగంగా నియమించారు. 13 జిల్లాలను 26 జిల్లాలకు పెంచుతూ రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ డివిజన్ల సంఖ్యను కూడా 52 నుంచి 74కు పెంచింది. అందుకు సంబంధించి ఫిబ్రవరి మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటుపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే మార్చి మొదటి వారంలోపు తెలపాలని 25 రోజులు గడువిచ్చింది. అందుకోసం ప్రత్యేకంగా కమిటీని కూడా ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి 17 వేలకు పైగా వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించి సుమారు (మిగతా 2లో..)

## 5వ తేదీన జనసేన విస్తృతస్థాయి సమావేశం..

### మంగళగిరికి రానున్న పవన్ కల్యాణ్



అమరావతి, : జనసేన పార్టీ ఆవిర్భావ సభ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎక్కడికక్కడ నిరసనలు తెలపడంతోపాటు, రాష్ట్ర నేతలు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. అలాగే పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఈ నెల ఐదో తేదీన మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు పార్టీ ప్రకటించింది. పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్, రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొనే ఈ సమావేశంలో పీఏసీ సభ్యులు, ప్రధాన కార్యదర్శులు, పార్టీ జిల్లాల అధ్యక్షులు, విభాగాల చైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గాల ఇంచార్జిలు, వీర మహిళా విభాగం ప్రాంతీయ కోర్డినేటర్లు, అధికార ప్రతినిధులు పాల్గొంటారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పాలన, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం, పెరిగిన విద్యుత్ చార్జీలు, రైతులు వ్యవసాయ స్థితిగతులు, వచ్చే కొద్ది నెలలలో పార్టీ చేపట్టవలసిన కార్యక్రమాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు.



## శ్రీలంక ప్రధాని రాజపక్స రాజీనామా!

కొలంబో: శ్రీలంక ప్రధానమంత్రి మహింద రాజపక్స తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఆయన తన రాజీనామా లేఖను అధ్యక్షుడు గొటబోయ రాజపక్సకు పంపారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. (మిగతా 2లో..)

## వీడిన బాలికల మిస్సింగ్ మిస్టరీ..

### ఆశ్రమానికి సురక్షితంగా చేర్చిన పోలీసులు



మంగళగిరి రూరల్, : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలో బాలికలు మిస్సింగ్ కేసును ఛేదించారు పోలీసులు. మంగళగిరి మండలం కాజ టోల్ గేట్ వెంబడి గల ఆమోదీని బాలికల ఆశ్రమం నుండి ఇద్దరు బాలికలు అదృశ్యం అయినట్లు గత నెల 31న ఆశ్రమ ఇన్‌చార్జి మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ రాంబాబు పర్యవేక్షణ లో సీఐ భూషణం, ఎస్సై విజయ్ కుమార్ రెడ్డితో కలిసి పోలీసు సిబ్బంది దీనిపై దర్యాప్తు చేపట్టారు. అయితే తెనాలి బస్టాండ్ వద్ద బాలికల ఆచూకీ కనుగొని వారిని సీడబ్ల్యూసీ వారికి అప్పగించినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. ఇద్దరు బాలికలను కాపాడి కేసును ఛేదించిన సీఐ భూషణం, ఎస్సై విజయ్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రమేశ్‌ను గుంటూరు అర్బన్ ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ అభినందించారు.

## ధాన్యం సేకరణలో అవకతవకలు..

### రైతులకు చెల్లింపుల్లో జాప్యంపై విచారణ జరపండి..



న్యూఢిల్లీ, : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరి సేకరణలో జరుగుతున్న అవకతవకలు, రైతులకు చెల్లింపుల్లో జాప్యంపై విచారణ జరపవలసినదిగా బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆయన ఆదివారం కేంద్ర వాణిజ్య, ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖా మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. రాష్ట్రం నలుమూలల్లోని వరి రైతుల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల ప్రకారం కేంద్రం వరి సేకరణకు అవసరమైన 90 శాతం నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ముందస్తుగానే విడుదల చేస్తోందని రెండు రోజుల క్రితం పీయూష్ గోయల్ రాజ్యసభలో తన ప్రశ్నకు సమాధానమిచ్చిన అంశాన్ని ఈ సందర్భంగా జీవీఎల్ గుర్తు చేశారు. కేంద్రం ఏపీకి గత ఐదేళ్లలో వరి సేకరణ కార్యకలాపాలకు రూ.34 వేల కోట్లు విడుదల చేయడం వల్ల లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరినందుకు ఆయన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. దళారులు, రైస్‌మిల్లర్లు, అవినీతి అధికారులు, రాజకీయ నాయకుల వరి సేకరణ కార్యకలాపాల్లో లబ్ధి పొందుతున్నారని జీవీఎల్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి ముందస్తుగా నిధులు పొందుతున్నప్పటికీ, కొన్న ధాన్యానికి రైతులకు చెల్లింపులు జరపడంలో ఆలస్యం చేస్తోందని, ఈ అడ్వాన్స్ మొత్తాన్ని ఇతర వ్యవహారాలకు మళ్లిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. వరి సేకరణ కార్యకలాపాలలో అవకతవకలు, రైతులకు చెల్లింపులలో విపరీతమైన జాప్యం దృష్ట్యా ప్రాథమిక అంచనా కోసం కేంద్ర మంత్రిత్వ శాఖ బృందాన్ని నియమించి స్వతంత్ర విచారణ చేపట్టాలని జీవీఎల్ నరసింహారావు కోరారు. కేంద్ర బృందంతో అన్ని జిల్లాల్లోని రైతులతో పారదర్శకంగా సంప్రదింపులు జరిపేలా చూడాలని ఆయన చెప్పారు. రైతుల ఖాతాలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా చెల్లింపులు చేయాలని అన్నారు. లేదంటే కేంద్ర ప్రభుత్వ నిధులను ఇతర ప్రయోజనాల కోసం మళ్లించకుండా కేవలం సంబంధిత ఖాతాలోకి మాత్రమే బదిలీ చేయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించవలసినదిగా పీయూష్ గోయల్‌కు ఎంపీ జీవీఎల్‌ఎన్ సూచించారు.

## ఘనంగా ప్రజాపాలన ఉగాది డైరీ ఆవిష్కరణ



విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి) : ఉగాది పర్వదినం సందర్భంగా విజయవాడ , స్నేహ గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ప్రజాపాలన జాతీయ దినపత్రిక తెలుగు సంవత్సరాది 2022- 23 డైరీ ని స్నేహ గ్రూపు అధినేత మరియు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి నేషనల్ కన్వీనర్ డాక్టర్ కటికల శివభాగ్య రావు IRS vrs సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్నేహ గ్రూప్ అధినేత మాట్లాడుతూ ప్రజా పాలన ఉగాది20 22 - 20 23 డైరీ ని ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉందని అలాగే ఈ డైరీ రూపకల్పనలో విశేష కృషిచేసిన ప్రజాపాలన ఏపీ స్టేట్ బ్యూరో పీతల అప్పాజీనీ మరియు ప్రజా పాలన సిబ్బందిని అభినందించారు. (మిగతా 2లో..)

## కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ పాండే..!



న్యూఢిల్లీ: భారత కొత్త చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా మనోజ్ పాండే పగ్గాలు చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. మార్చి నెలాఖరులో పదవీ విరమణ చేస్తున్న ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే స్థానంలో పాండే పగ్గాలు చేపడతారు. ఇటీవల విమాన ప్రమాదంలో మరణించిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ స్థానంలో ఆ పదవిని జనరల్ నరవణే చేపట్టే అవకాశాలున్నాయి. గత ఏడాది డిసెంబర్ 8న విమానం కుప్పకూలిన ఘటనలో బిపిన్ రావత్, ఆయన భార్య మధులిక, 12 మంది సాయుధ సిబ్బంది మృతి చెందిన ఘటన యావద్దేశాన్ని కుదిపేసింది. కాగా, గత మూడు నెలల్లో పదవీ విరమణ చేసిన కొంతమంది ఉన్నతాధికారుల తరువాత సీనియర్‌గా లెఫ్టినెంట్ జనరల్ పాండే ఉన్నారు. ప్రస్తుత లెఫ్టినెంట్ జనరల్ రాజ్‌శుక్లా (ఏఆర్‌టీఆర్‌ఏసీ) ఈనెల 31న రిటైరవుతున్నారు. గత జనవరి 31న సీనియర్ మోస్ట్ అధికారులైన లెఫ్టినెంట్ జనరల్ సీపీ మొహంతీ, లెఫ్టినెంట్ జనరల్ వైకే జోషిలు పదవీ విరణణ చేశారు. ఈ మార్చి నెలాఖరులోనే కీలక పదవుల్లో మార్పులు చోటుచేసుకోనున్నారు. లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా స్థానంలో ఏఆర్‌టీఆర్‌ఏసీ కమాండ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఎస్ఎస్ మహల్ సిమ్లాలో బాధ్యతలు చేపడతారు. ఆర్మీ అడ్జుటంట్ జనరల్‌గా లెఫ్టినెంట్ జనరల్ సి.బన్సీ బాధ్యతలు తీసుకుంటారు. ఉత్తర భారత్ ఏరియాకు జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా లెఫ్టినెంట్ జనరల్ జేపీ మాథ్యూస్ బాధ్యతలు చేపడతారు.

ప్రజా సమస్యలను మీడియా ద్వారా
ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా
ఎదగాలనుకుంటున్నారా?
అయితే రండి.
రెండు తెలుగు రాష్ట్రాల లోని 294
నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని
గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో
మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్
మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)
రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం
అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని
(Master Key) సాధిద్దాం
వివరాలకు సంప్రదించండి
AP : 88869 11944
TS : 76600 27678, 88860 90484

# నేడు ఉదయం 9.05కు...

## 'కొత్త జిల్లాలు, కొత్త పాలన' ప్రారంభించనున్న జగన్

**(మొదటి పేజీ తరువాయి)**

100కు పైగా మార్పులు చేపట్టారు. అందులో భాగంగానే రెవెన్యూ డివిజన్ల సంఖ్యను అదనంగా మరో 5కు పెంచారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల పరిధిలో కొన్ని మండలాలను పాత జిల్లాల్లోనే కొనసాగిస్తూ తుది గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయినట్లయింది.

**శ్రీకారం..**

ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన పాలనను అందిస్తానని గతంలో ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఉగాది నుంచి రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి కొత్త పాలనను అందించాలని సంకల్పించారు. అందులో భాగంగానే ఉగాది నాడే పాలనను ప్రారంభించాలని మొదట ముహూర్తం నిర్ణయించినప్పటికి వరుస సెలవుల నేపథ్యంలో సోమవారానికి (ఏప్రిల్ 4)కు మార్చారు. అదేవిధంగా నరసరావుపేట జిల్లా కేంద్రం నుంచి కొత్త పాలనను లాంఛనంగా ప్రారంభించాలని అనుకున్నప్పటికీ అనివార్య కారణాల వల్ల ఆ కార్యక్రమాన్ని తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచే చేపట్టాలని చివరి నిమిషంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో సోమవారం ఉదయం 9.05 నిమిషాల నుండి 9.45 నిమిషాలలోపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొత్త జిల్లాల పాలనను ప్రారంభించబోతున్నారు. రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలకు పెంచుతూ శనివారం రాత్రి ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది. అంతకు ముందే 26 జిల్లాలకు సారథుల నియామకానికి సంబంధించి కూడా జీవోను విడుదల చేసింది. కొన్ని పాత జిల్లాలకు పాత కలెక్టర్లనే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త జిల్లాలతో పాటు మరికొన్ని పాత జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. అలాగే ఐపీఎస్ బదిలీల ప్రక్రియను కూడా అంతే వేగవంతంగా చేపట్టింది. రాష్ట్ర చరిత్రలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు పెద్ద ఎత్తున చేపట్టడం ఇదే మొదటిసారి. వీరితో పాటు డీఆర్వోలు, ఆర్డీఓల బదిలీలు కూడా పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున డిప్యూటి కలెక్టర్ల బదిలీలను చేపట్టింది. దీంతో దాదాపుగా రెండు, మూడు జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ కొత్త సారథులతో కొత్త జిల్లాల పాలన ముందుకు సాగ బోతుంది.

**ఒకట్రెండు రోజుల్లో..పూర్తి స్థాయి యంత్రాంగం**

రాష్ట్రంలో 26 కొత్త జిల్లాలకు సంబంధించి ఇప్పటికే కలెక్టర్ , ఎస్పీ, డీఆర్వో, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ల వంటి కీలక విభాగాలకు కొత్త సారథులను ప్రభుత్వం నియమించింది. అదేవిధంగా సోమ, మంగళవారాల్లో 56 శాఖలకు సంబంధించి జిల్లా అధికారుల నియామక ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టనుంది. అందుకు సంబంధించి కసరత్తు కూడా దాదాపు పూర్తయింది. ఇప్పటికే రెవెన్యూ విభాగంలో బదిలీల ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. మండల స్థాయిలో కూడా మార్పులతో పూర్తి స్థాయి యంత్రాంగాన్ని నియమించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వీటితో పాటు ఆయా మున్సిపాలిటీలు, కీలకమైన విభాగాలకు సంబంధించి జిల్లా అధికారుల నియామకాన్ని కూడా ఒకట్రెండు రోజుల్లో పూర్తి చేయబోతుంది. కొత్త జిల్లాల పాలన వైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శరవేగంగా అడుగులు వేశారు. అంతే వేగంగా రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన పాలనను అందించేందుకు 13 జిల్లాలను 26 జిల్లాలకు విభజిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రాష్ట్రంలో సరికొత్త పాలన, విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్ శ్రీకారం చుట్టినట్లయింది.

# శ్రీలంక ప్రధాని రాజపక్స రాజీనామా!

**(మొదటి పేజీ తరువాయి)**

ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోన్న శ్రీలంకలో తాజాగా నిరసనలు పతాకస్థాయికి చేరాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు తీవ్రం కావడంతో దేశంలో ఇప్పటికే సామాజిక మాధ్యమాలపై ఆంక్షలు విధించారు. తాజా సంక్షోభం తమ ప్రభుత్వ నిర్ణయాల వల్ల కాదని, కోవిడ్ మూలంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని విదేశీ మారక నిల్వలు కరిగిపోయాయని రాజపక్స ప్రభుత్వం చెబుతూ వస్తోంది. సంక్షోభంలో చిక్కుకున్న శ్రీలంకకు భారత్ పెద్ద ఎత్తున సాయం అందిస్తోంది. 2.5 బిలియన్ డాలర్ల సాయంతో పాటు లక్షల టన్నుల ఇంధనాన్ని పంపింది. బియ్యం కూడా పంపింది.

# ఘనంగా ప్రజాపాలన ఉగాది డైరీ ఆవిష్కరణ



ఏపీ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా నియామక పత్రాన్ని తీసుకుంటున్న నమ్మి అప్పారావు

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ కార్యక్రమంలో ప్రముఖ బీసీ నాయకులు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గా నూతన నియామకం అందుకున్న నమ్మి అప్పారావు , విజయవాడ పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి కార్యాలయ దాత దాసరి కేశవులు, స్నేహ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కటికల క్రాంతి కుమార్, పార్స్ ట్రెజరర్ గురజాల శ్రీనివాసరావు మరియు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి వివిధ సంఘాల అధ్యక్షులు మరియు సభ్యులు ప్రజాపాలన దిన పత్రిక డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మన్యం గిరుల్లో ఘుమఘుమలు..


విశాఖపట్టణం, ఏప్రిల్ 2, :మన్యం గిరుల్లో కాఫీ పూల ఘుమఘుమలు..!విశాఖ ఏజెన్సీ అనగానే ఎత్తైన కొండలు.. పచ్చటి చెట్లు.. తోటలు.. ప్రకృతి అందాలు. ఇలా చెప్పుకుంటూ పోతే విశాఖ మన్యం అందాలు వర్ణించలేనివి. ఒక్కో సీజన్లో విశాఖ మన్యం ఒక్కో ప్రకృతి అందాన్ని సంతరించుకుంటుంది. వర్షాకాలంలో పచ్చని చెట్లన్నీ పులకిస్తే శీతాకాలంలో గిరులను మంచుదుప్పటి కమ్మేస్తాయి. వలిసె పూల అందాలు పచ్చటి తివాచీ పరచినట్లుగా కనువిందు చేస్తాయి. ఇక వేసవి వచ్చిందంటే చాలు? గిరులన్నీ కాఫీ పూల ఘుమఘుమలతో సువాసన వెదజల్లుతుంటాయి. ప్రకృతి అందాలకు నిలయం విశాఖ మన్యం. ఏ సీజన్ లోనైనా ఏజెన్సీ ఓ ప్రత్యేకత సంతరించుకుంటుంది. వర్షాకాలంలో ఒకలా.. శీతాకాలంలో మరోలా కనువిందుచేసే మన్యం వేసవి వచ్చిందంటే చాలు కాఫీ పూల అందాలతో పులకిస్తోంది. విశాఖ ఏజెన్సీ వ్యాప్తంగా 11 మండలాల్లో లక్షా యాభై రెండు వేల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. వేలాది మంది రైతులు ఈ కాఫీ పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. మంచి ఆదాయం వచ్చే పంట కావడంతో ఏజెన్సీలోని మెట్ట ప్రాంతాల్లో చాలా మంది గిరిజన రైతులు.. కాఫీ పంట పండిస్తూ ఉంటారు.పాడేరు ఘాట్ రోడ్డు నుంచి మొదలై చిలకలగడ్డ, సీలేరు వరకు కాఫీ తోటలు విస్తరించి ఉన్నాయి. ఏజెన్సీలో పండే ఈ కాఫీ తోటలు వేసవి సీజన్ లో పూతకు వస్తాయి. తెల్లటి వర్ణంలో చెట్లన్నీ శ్వేత దుప్పటిని పరచుకున్నట్టు మెరిసిపోతుంటాయి. సువాసనలు వెదజల్లుతూ అందరినీ ఆకర్షిస్తూ ఉంటాయి. దీంతో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులు కాఫీ తోటల అందాలను వీక్షిస్తూ ఉంటారు

# అంజాద్ బాషా...రిబ్బన్ కట్టింగ్స్ కే పరిమితం..!

కడప, ఏప్రిల్ 2,:పేరు గొప్ప .. ఊరు దిబ్బ అనే సామెత మీకు తెలుసా? ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో ఆ నాయకుడి తీరు అలాగే ఉంది మరి. పేరుకేమో? ఉప ముఖ్యమంత్రి రిబ్బన్ కట్టింగుల్లో తప్ప.. ఎక్కడా కనిపించరు. ప్రజలకు ఆమడ దూరంలో ఉంటారు? ఆడంబరాలకు మాత్రం అందరికాన్ని ముందుంటారు. పుయ్.. పుయ్.. అని సైరన్ ఏసుకుని, వెనకాల ఎస్కార్ట్ వేసుకుని రావడమే తప్ప.. చేసిన పని ఒక్కటీ లేదని జనం గుసగుసలాడుకుంటున్నారట. ఇంతకీ ఎవరా గొప్ప నేత?డిప్యూటీ సీఎం అంజాద్ భాషా తీరుపై జనం అసహనం! వైఎస్ కుటుంబంతో సాన్నిహిత్యం కలిసొచ్చిందా? పదవి దక్కినా.. ప్రజలు మన్ననలు దక్కడం లేదా? ఇదే అవునంటున్నారు కడప జిల్లా నేతలు. మొదట్లో కడప కార్పొరేటర్? ఆ తర్వాత అదృష్టం కలిసొచ్చింది. వైఎస్ కుటుంబంతో సాన్నిహిత్యం మరింత లక్ కలిసొచ్చేలా చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దగ్గరి వ్యక్తిగా పేరున్న అంజాద్ భాషా.. అనూహ్యంగా అందలమెక్కేశారు. రెండుసార్లు కడప అసెంబ్లీ సెగ్మెంగ్‌లో విజయం సాధించి.. మైనార్టీ కోటాలో డిప్యూటీ సీఎం అయిపోయారు. అంది వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని.. అత్యున్నత పదవిని దక్కించుకున్న అంజాద్.. ఆ స్థాయిలో జనాల మన్ననలు పొందడంలో మాత్రం విఫలమయ్యారనే టాక్ వినిపిస్తోంది. పేరుకే పెద్ద పదవి తప్ప.. నియోజకవర్గ ప్రజలకు సార్ చేస్తున్నదేమీ లేదట. రిబ్బన్ కటింగ్ ప్రోగ్రాములకు తప్ప ఎక్కడా కనిపించడం లేదట. ప్రజలకు ఆమడ దూరంలో ఉండి? ఆరంభాలకు, ఆడంబరాలకు ముందుంటున్నారట. సైరన్ కారేసుకుని దూసుకెళ్తుంటారు తప్ప.. జనం వెతల్ని కళ్లారా చూడలేకపోతున్నారని స్థానికంగా గుసగుసలు మొదలయ్యాయి. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా.. కడప నగరానికి అంజాద్ భాషా చేసిన అభివృద్ధి మాత్రం గుండు సున్నా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మైనారిటీశాఖ కూడా ఆయనదగ్గరే ఉంది.. అలాగని మైనారిటీలకు ఒక్క పనిచేశారా? అంటే అదీ లేదు. దీన్ని బట్టి అంజాద్ భాయ్ పనితనం ఏంటో అర్థం చేసుకోవచ్చు. 2014 లో మైనారిటీ కోటాలో లక్కీగా కడప శాసనసభ సీటు దక్కించుకున్న అంజాద్.. జగన్ బొమ్మ పెట్టుకుని గెలిచారు. 2019 లోనూ ఫ్యాన్ గాలిలో కొట్టుకొచ్చేశారు. అదే కోటాలో అనూహ్యంగా డిప్యూటి సీఎం అయిపోయారు. అయితే, తమ గోడు వినని ఎమ్మెల్యే.. డిప్యూటీ సీఎం అయితే ఏంటి? ఏకంగా సీఎం అయితే మాకేంటి? అంటున్నారట కడప నగర ప్రజలు. ఎమ్మెల్యే తీరుపట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారట. 2014 మొదలు.. నగరంలో ఈ అభివృద్ధి చేశానని చెప్పుకొనే పరిస్థితి అంజాద్‌కు లేదంటే అతిశయోక్తి కాదు. పోనీ, డిప్యూటి సియం హోదాలో రాష్ట్రంలోని ఇతర జిల్లాలయినా తిరిగారా? అంటే అదీ లేదు. అసలు ఇలాంటి నేత మనకు అవసరమా? అనే ఫీలింగ్‌లో కడప ప్రజలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈసారి టాటా, బైబై, సీరియో అనేందుకు రెఢీ అవుతున్నారట. వైసీపీ మీద అభిమానం ఉన్నా? కడప ఎమ్మెల్యే అంజాద్‌పై కడప ప్రజలు చాలా కోపంగా ఉన్నారని స్పష్టమవుతోంది. సమస్యలు చెప్పుకొనేందుకు వెళితే.. తప్పించుకుని తిరిగే నేత మాకవసరం లేదంటున్నారట జనం. ఏటా కడప నగరాన్ని ముంచెత్తే బుగ్గవంక ముప్పు సమయంలోనూ.. నామ్‌కే వాస్తే వచ్చి వెళతారు తప్ప.. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని నగరజనం గుర్రుగా ఉన్నారట. జిల్లా మంత్రి అయ్యుండి రాజంపేట వరదలవైపు కన్నెత్తి కూడా చూడలేదంటే అంజాద్ భాయ్ పనితీరేంటో ఈజీగా అర్థమవుతోంది. భాషా భాయ్ పై పార్టీ నేతలు కూడా గుర్రుగానే ఉన్నారట. ప్రజల సమస్యలు పక్కన పెట్టారు సరే, పార్టీలో ఉన్న క్యాడర్‌నైనా కాపాడు కుంటున్నారా అంటే అదీ లేదు. అసలాయన తమను కలిసిన ధాఖలాలే లేవని పార్టీ ద్వితియ శ్రేణి నాయకులు వాపోతున్నారు. ఈ సారి కనుక అంజాద్ బాషాకు సీటిస్తే.. కచ్చితంగా గెలుపుకోసం పోరాడాల్సిందేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా, అంజాద్ భాషా తీరు మారకుంటే.. వచ్చే ఎన్నికల్లో ఎలాంటి హవా ఉన్నా విజయం కష్టమేనన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది.

# గోటి తలంబ్రాలకు అంతా సిద్ధం

కాకినాడ, ఏప్రిల్ 2, :భద్రాద్రి రాముని కల్యాణానికి ప్రత్యేకంగా కోటి తలంబ్రాలను గోటితో వలిసి సిద్ధం చేసారు. భక్తి శ్రద్ధలతో మూడు నెలలుగా ప్రత్యేకంగా ఈ ధాన్యాన్ని గోళ్ళతో వాలిచి..గత 11 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ఈ గోటి తలంబ్రాలను తయారు చేస్తారు? నాడు సీతారాముల కళ్యాణానికి శచీదేవి, అహల్యలతో పాటు, శబరి తమ గోటితో వలచిన తలంబ్రాలనే ఉపయోగించారన్న పురాణ కథనంతో ప్రేరణ పొందిన ఈ శ్రీకృష్ణచైతన్య సంఘం స్థాపకుడు కళ్యాణం అప్పారావు తానే ఈ బృహుత్కార్యానికి పూనుకున్నారు. 2012లో రామభక్తులను ఏకం చేసి.. తాను తన సొంత పొలంలో పండించిన వడ్లను వారికి ముందుగానే అందించి.. ఓ శుభ ముహూర్తాన తలంబ్రాలు వలవడం మొదలుపట్టారు.శ్రీరామక్షేత్రంలోనే గోటితలంబ్రాల పంట.పండించి ఈ గోటి తలంబ్రాల విషయంలో అడుగడుగునా ప్రతి విషయంలోనూ ప్రత్యేక భక్తిశ్రద్ధలను తీసుకుంటారు. తలంబ్రాలకు ఉపయోగించే వరి నారు పోసే దగ్గరి నుంచి.. పంట కోత కోసేదాకా ప్రతి విషయాన్ని ఆధ్యాత్మికంగానే భావించి.. అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ క్రతువును నిర్వహిస్తుంటారు. నారు పోసే ముందు విత్తనాలను భద్రాచలం సీతారాముల మూలమూర్తుల పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం వాటిని అప్పారావుకు చెందిన తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం, అచ్యుతాపురంలోని ఎకరం పొలంలో ఆంజనేయుడు, ఇతర వానరుల వేషధారణలోనే పొలం దున్ని, నారు పోసి.. మడి చేసి నాట్లు వేస్తారు. పొట్ట దశకు వచ్చాక శ్రీమంతం కూడా చేస్తారు. వరికోత సమయంలోనూ రాముడి వేషధారణలో ఉన్న భక్తునికి మొదట అందజేస్తారు.ఇలా మూడు నెలల పాటు భక్తి శ్రద్ధలతో పండించిన పంటను.. శ్రీరామనవమి రెండు నెలల ముందు నుంచే భక్తజనానికి పంపిణీ చేసి వారిచేత వలిపిస్తారు. ఇలా పరిసర గ్రామాల ప్రజలు ఈ కోటి గోటి తలంబ్రాల మహా యజ్ఞంలో పాలుపంచుకుంటారు. ఈ కార్యక్రమానికి వడ్లు వలుపు.. శ్రీరాముని పిలుపు' పేరిట నామకరణం చేస్తారు? అనంతరం ఇలా వలిచిన బియ్యాన్ని ప్రత్యేక కుండలో నింపి రాజమండ్రిలోని గోదావరి పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి రామయ్య పెళ్లికి రామచిలుకలతో పిలుపు కార్యక్రమం నిర్వహించి.. భద్రాచలం తీసుకొస్తారు. ఇలా తెచ్చిన తలంబ్రాలతో భద్రాద్రి ప్రదక్షిణ చేస్తారు? తలంబ్రాలు తీసుకొస్తున్న రామయ్య అంటూ రామచిలుకతో సందేహం గోదావరి చెంతన జరగడం అదృష్టం గా భావిస్తున్నాను అంటున్నారు నిర్వాహకులుఎన్నో ఏళ్లుగా భద్రాద్రి రామయ్యకు ఈ గోటి తలంబ్రాలను ఆలయంలో అప్పగిస్తున్నారు.. వీటినే శ్రీసీతారాముల కళ్యాణంలో వినియోగిస్తారు. ఇలా ఈ గోటి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొంటే శుభం జరుగుతుందన్న నమ్మకంతో ఏటా భక్తులు విరివిగా ముందుకొస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని ఒంటిమిట్టలో జరిపే సీతారాముల కళ్యాణానికి సైతం ఈ గోటి తలంబ్రాలను పంపుతున్నామంతున్నారు కల్యాణం అప్పారావు.. కల్యాణోత్సవం అంటే గుర్తొచ్చేది..



భద్రాద్రిలో జరిగే సీతారాముల కల్యాణమే. దీనికోసం భక్తులు ఎదురు చూస్తుంటారు. సీతారామకల్యాణాన్ని చూస్తూనే వారు తరించిపోతారు. ఈయేడాది ఏప్రిల్ 10 న జరగనున్న శ్రీరామనవమికి పంపే తలంబ్రాలకు ఎంతో విశిష్టత ఉంటుంది..భద్రాద్రి రామయ్య కల్యాణానికి తలంబ్రాలు స్వయంగా..రామ నామం తో వలుస్తున్న మహిళలు కల్యాణానికి కోటి తలంబ్రాలు పంపుతారు.. కల్యాణం అనంతరం తిరిగి ఎవరైతే ఈ కోట తలంబ్రాలు వాలిచారో వారికి ?కల్యాణం అనంతరం రాములోరి తలంబ్రాలు తిరిగి వీరికి పంపించడం ఆనవాయితీ.. చివరి ఘట్టం రాజమండ్రి పుష్కర ఘాట్ గోదావరి ఘటన జరగడం గోదావరి సినిమాను తలపిస్తుంది

# నష్టాల్లో కోనసీమ రైతులు

అమలాపురం, ఏప్రిల్ 2, :అమ్మబోతే అడవి? కొనబోతే కొరివి అన్నట్టుగా తయారైంది కొబ్బరి రైతుల దుస్థితి. కన్నకొడుకు ఆదుకున్న లేకపోయినా కొబ్బరి చెట్టు ఆదుకొంటుందని కోనసీమ వాసుల నమ్మకం. కొబ్బరి చెట్టును కల్పతరువుగా పూజిస్తారు కోనసీమ వాసులు . కొబ్బరి ఉత్పత్తుల పేరు చెబితే గుర్తొచ్చేది కేరళ తరువాత కోనసీమ కొబ్బరి మాత్రమే. గత కొన్ని ఏళ్లుగా కోనసీమ కొబ్బరి రైతులు దిగుబడి లేక నల్లి తెగుళ్ల వల్ల ఉత్పత్తి తగ్గిపోయి ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొంటున్నారు. వాతావరణంలో మార్పుల వలన కొబ్బరి ఉత్పత్తిలో మార్పువచ్చి రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఏటా సెప్టెంబర్ నెల రెండవ తేదీన ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపుకుంటారు కొబ్బరి రైతులు. కొబ్బరిపంట పై ఆధారపడిన రైతుల పరిస్థితి ఎలా వుందో చూద్దాం.కోనసీమ అంటే పచ్చని తివాచీ పరచినట్లుగా ప్రకృతి అందాలతోను , పిల్ల కాలువలతోను ,చుట్టూ గోదావరి అందాలతోను కొబ్బరి తోటలతోను అలరారుతూ వుంటుంది. కోనసీమలో సుమారు లక్షా ఐదువేల ఎకరాల్లో కొబ్బరిపంట సాగు సాగవుతోంది. అరవై కోట్ల కొబ్బరికాయలు ఇక్కడినుంచి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. 1996 లో సంభవించిన తుఫాన్ తరువాత ఆ పరిస్థితి కోనసీమ లో కనుమరుగయ్యింది. ఈ కోనసీమలో ఎక్కువశాతం రైతులు కొబ్బరి పంట మీదే ఆధారపడి వుంటారు.1996 తర్వాత ఆశించిన దిగుబడి లేక , అనుకున్న ధరలేక కొబ్బరి రైతు విలవిలలాడిపోయాడు . కొంతమంది కొబ్బరి రైతులు కొబ్బరి తోటలను అయినకాడికి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు . ఈ లోగా 2008 సంవత్సరంలో అనూహ్యంగా ధర పెరగడంతో రైతు కళ్ళల్లో ఒకింత ఆనందం వెల్లివిరిసింది . ఈలోగా దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్న సామెత కొబ్బరి రైతులకు ఎదురయ్యింది. ధర పెరిగిన ఆనందంలో ఉన్న కొబ్బరి రైతుకి నల్లి తెగుళ్ల రూపంలో కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయాడు కొబ్బరి రైతు . అక్కడి నుండి కొబ్బరి మార్కెట్లు నుండి ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కొబ్బరి పంటపై ఆసక్తి తగ్గించాడు కొబ్బరి రైతు.మరలా 2008 తరువాత 2017 ఆగస్టు మాసం నుండి ధరలు పెరగడంతో కొబ్బరి రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి . ఈలోగా కొబ్బరికి రుగోస్ అనే కొత్త వైరస్ రావడంతో ఏంచెయ్యాలో తెలియని అయోమయ పరిస్థితిలో కొబ్బరి రైతు వున్నాడు . అంతలోనే కొబ్బరి ధరలు పతనం అవ్వడంతో కొబ్బరి పంట పై రైతు పెద్దగా ఆసక్తి కనబరచడంలేదు . అందుకే కొబ్బరి తోటలను అయినకాడికి రియలె ఎస్టేట్ దళారులకు అమ్ముకుంటున్నాడు. ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు , సంభవించిన వరదలకు కొబ్బరి తోటలకు ఆశించిన తెల్లదోమ ప్రభావం తగ్గి అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.ఒకపక్క కరోనా వైరస్ ఎగుమతులు కూడా అంతంత మాత్రం గానే జరుగుతుండటంతో రైతు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు. కొబ్బరికి ఎక్కువగా కలిసొచ్చే కాలం సెప్టెంబర్ ,అక్టోబర్ ,నవంబర్ మాసాలు , ఈ మాసాల్లో కొబ్బరికి అధిక డిమాండ్ వుండి బీహార్ , మహారాష్ట్ర , జార్కండ్ , రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి అవుతుంది. అయితే ధరల ఒడిదుడుకులతో నష్టపోతున్న తమను ఆదుకోవాలని కొబ్బరి రైతులు ప్రభుత్వాలను కోరుతున్నారు.

# చంద్రబాబుని సీఎం చేసేదానికి పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టడం ఎందుకు?: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట, ఏప్రిల్ 3(ప్రజాపాలన ప్రతినిధి.): రొంపిచర్ల మండల కేంద్రంలోని శంకర స్వామి తిరునాళ్ళ సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయల స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరునాళ్ళ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభలను సందర్శించి.. తిరునాళ్ళకు విచ్చేసిన అశేష జనవాహిని ఉద్దేశించి మాట్లాడారు.. 900 ఏళ్ల పల్నాడు చరిత్రను గుర్తించిన ఏకైక వ్యక్తి జగన్ ని శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత 10 నుంచి 15 వేల మంది ఉద్యోగులు పేటకు రానున్నారు అని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో తొలిమెట్టు జగన్ పల్నాడు ప్రాంతానికి అవకాశం కల్పించారని వివరించారు. కరోనా కష్ట కాలంలో కూడా పేదలకు మేలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్సీపీ ప్రభుత్వం అన్నారు. 27 రకాల సంక్షేమ పథకాలు తీసుకువచ్చి.. మంచి చేస్తున్న ప్రభుత్వం తమది అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు మాయ మాట మాటలు చెప్పినా.. ఇవాళ పార్టీలకు అతీతంగా అందరి అకౌట్లలో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. బాబు మాటలు నమ్మితే ఒక్క రూపాయి కూడా పేదవారికి అందదు అన్నారు. 2014లో రుణమాఫీ అని మాట ఇచ్చి అధికారంలోకి రాగానే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పేరుతో చేతులు ఎత్తేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చిన ఏకైక వ్యక్తి జగన్ గారని ప్రశంసించారు. చంద్రబాబు సీఎం చేయాలని పవన్కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును భుజాన ఎత్తుకుంటే పవన్ కళ్యాణ్ సీఎం అవ్వడం జరగదన్నారు. చంద్రబాబు సీఎం చేసే కాడికి పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టడం ఎందుకు అని ప్రశ్నించారు. రొంపిచర్ల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘటించారు. రొంపిచర్ల కి కేంద్రీయ విద్యాలయం తెచ్చామన్నారు. పార్లమెంట్ పరిధిలో 2 కేంద్ర విద్యాలయాలను ఇచ్చిన ఘనత ఎంపీ గారికే దక్కుతుందన్నారు. రొంపిచర్ల కు జూనియర్ కాలేజ్ ను కూడా మంజూరు చేశామన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయి అన్నారు. వేణుగోపాల స్వామి గుడికి 40 లక్షల మంజూరు చేసారని.. త్వరలోనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. రొంపిచర్లలో రూ. 4 కోట్లతో ఇంటింటికి మంచినీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం లో అభివృద్ధి జరగడం లేదని విమర్శించే ప్రతిపక్షాల గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. నరసరావుపేటకు కళాశాల మంజూరైనా గత ప్రభుత్వం హయాంలో భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాశ్వత భవనాలు కడుతున్నామన్నారు. కేంద్రీయ విద్యాలయ నరసరావుపేటలో పెట్టాలనుకున్న ఎమ్మెల్యే గారి ఆలోచన మేరకు రొంపిచర్లలో పెట్టడం జరిగింది అన్నారు. ఇవళ గ్రామంలో ఏ ఇబ్బంది ఉన్నా.. సచివాలయం ద్వారా పరిష్కారమవుతున్న విషయం మనందరికీ తెలుసు అన్నారు. వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలు చూసి ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి అని వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పంచాంగ శ్రవణం ప్రకారం ఈ ఏడాది రైతులకు మంచి జరుగుతుందన్నారు. గతేడాదిలా.. ప్రకృతి వైపరీత్యాలు, మిర్చి పంటకు తెగుళ్లు లేకుండా.. పల్నాడు ప్రాంతం పాడిపంటలతో పచ్చగా ఉండాలని ఆకాంక్షించారు.

## రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న నివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన మొండితోక బ్రదర్స్



విజయవాడ ఏప్రిల్3 ప్రజాపాలన ప్రతినిధి: నగరంలో ని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ గా బాధ్య తలు నిర్వహించి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ గా బదిలీపై వెళ్తున్న జె నివాస్ ని మర్యాదపూర్వకంగా క లిసి పుష్పగుచ్చం అందజేసిన నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, ఎమ్మెల్సీ డా క్టర్ మొండితోక అరుణ్ కుమార్ , ఎమ్మెల్సీ తల శిల రఘురాం , పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్. కృష్ణాజిల్లా కలెక్టర్ గా ఉత్తమ సేవలు అందించారని ,జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి మంచి కలెక్టర్ గా పేరు తెచ్చుకున్నారని జె నివాస్ ని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించారు

## నిశ్చితార్థ వేడుకలో ఎమ్మెల్యే మొండితోక జగన్



నందిగామ ఏప్రిల్ 3 ప్రజా పాలన ప్రతినిధి: పట్టణం లోని ఆర్.యస్ గార్డెన్స్ లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండా కృష్ణారెడ్డి మేనకోడలు దీపిక నిశ్చితార్థ వేడుకలోఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావుపాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారుఈకార్య క్రమం లో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొ న్నారు.

## పల్నాడు జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఆవిర్భావ ఏర్పాట్లను పరిశీలించిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట . ఏ ప్రిల్ 3. (ప్రజా పాలన ప్రతినిధి) :నరసరావుపేట: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మరో సువర్ణ అధ్యయనానికి రేపు బీజం పడనుంది. పాలనను సులభతరం చేస్తూ.. కొత్త జిల్లాలను ఏర్పాటుకు గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టిన తరుణంలో.. రేపటి నుంచి కొత్త జిల్లాల కేంద్రాల నుంచి పాలన ప్రారంభం కానున్న నేపథ్యంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి .. లింగంగుంట్ల ఎన్ఎస్పీ కాలనీలో పల్నాడు జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఆవిర్భావ ఏర్పాట్లను పరిశీలించారు.

## జర్నలిస్టుల క్రీడలు నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందిస్తానని ఒంగోలు మేయర్ గంగాడ సుజాత వెల్లడి



ప్రకాశంజిల్లా : ఒంగోలులోని హెూటల్ మౌర్య ఇన్ లో జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశంజిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశంజిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్కే.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ దినదిన కార్యక్రమాలతో బిజీగా ఉండే జర్నలిస్టులు వారి మానసిక ఉల్లాసం కోసం జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో జర్నలిస్ట్ స్పోర్ట్స్ ప్రకాశంజిల్లా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టు స్పోర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు ఎస్.దుర్గారావు మాట్లాడుతూ జర్నలిస్టులు వృత్తితో పాటు క్రీడల్లో వారి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు వీలుగా 2012లో అసోసియేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు పేదలు అయినా క్రికెట్, వాలీబాల్ కబాడీ టోర్నమెంట్లో నిర్వహించామన్నారు, భవిష్యత్తులో జాతీయస్థాయి టోర్నమెంటు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశంజిల్లా కొత్త కమిటీని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు ఓబులం ప్రసాద్, సి. హెచ్ రామకృష్ణరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.ఎస్.ఎం కృష్ణంరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రసాద్, జిల్లా కమిటీ నాయకులు రాజు, జై. శ్రీధర్, రామరాజు, శ్రీనివాస్, సురేంద్ర, శ్రీనివాసరెడ్డి, వినోద్, శ్రీను, కిరణ్, వివేకానంద, అశోక్, శేఖర్, అశోక్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు అనంతరం జర్నలిస్ట్ స్పోర్ట్స్ ఆఫ్ ప్రకాశంజిల్లా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎస్కే హసన్, జిల్లా అధ్యక్షులుగా లంకా రాజు, ఉపాధ్యక్షులుగా ఉబ్బా అశోక్, శ్రీధర్, కార్యదర్శి, చెంగల్రావు, ప్రధాన కార్యదర్శులుగా రాజేష్, శ్రీనివాస్ కోశాధికారిగా రామరాజు కార్యనిర్వాహక కార్యదర్శిగా చంద్ర, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస రెడ్డి, సురేంద్ర, చిన్న, సునీల్, రాజేష్, బి.అశోక్, వినోద్, శేఖర్, రాజా, కిరణ్ జిల్లా మేనేజరుగా కిరణ్ ను ఎన్నుకున్నారు.

## బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గ సంఘం



నరసరావుపేట. ఏప్రిల్ 3.(ప్రజాపాలన ప్రతినిధి) :నరసరావుపేట పట్టణంలో స్టేషన్ రోడ్ లో ఉన్నటువంటి సెంటినరీ బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గం సంఘము యొక్క సమక్షంలో ఆదివారం ఏకగ్రీవంగ ఆవెూదం తెలిపేరు. ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది.ప్రెసిడెంట్ గా బొమ్మ జై సూర్య ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ గా కుందా రాజేష్, సెక్రటరీగా అమరరపు సాల్మన్ , వైస్ సెక్రటరీ పిట్ట ప్రవీణ, కోశాధికారిగా కాకనీ విద్యాసాగర్, సహ కోశాధికారిగా చల్లగుండ్ల సతీష్,సువార్తకమిటీ చైర్మన్ గా బిర్నిడి సుందర్ రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మందపాటి ఇసాక్., కుందా ప్రకాష్ రావు., నూనె అంజమ్మ ఎన్నుకోవడం జరిగింది , ఎన్నికైన సభ్యులు సెయింట్నరి చర్చి యొక్క సాంప్రదాయాలను పవిత్రతను చర్చి విధానమును చర్చి రాజ్యాంగము పెద్దలను గౌరవించి అందు నిమిత్తము చే చర్చి అభివృద్ధికి అడుగులు వేస్తామని వారు తెలిపినారు. మిగత ప్రాంతాల వారీగా తదుపరి ప్రకటిస్తామని ఎన్నికల ఎగ్జిక్యూటివ్ వారు తెలిపినారు. నిర్వహించిన వారికి గత కమిటీకి కృతజ్ఞతలు తెలియ చేస్తున్నట్లు అధ్యక్షుడు బొమ్మలు జయసూర్యప్రకాష్ తెలిపారు.

## సిపియస్ ఉద్యోగుల శంఖారావ పోస్టర్ ఆవిష్కరణ




నందిగామ ఏప్రిల్ 3 ప్రజా పాలన ప్రతినిధి:ఏపీ సి పిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలోఏప్రిల్ ఐదో తారీకు నిర్వహించు సిపియస్ ఉద్యోగుల శంఖా రావసభ మరియు ర్యాలీని జయప్రదం చేయాలని స్థా నిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం నందు సిపిఎస్ ఉద్యోగులతో కలసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిపియస్ ఉద్యోగుల జిల్లా సహా అధ్యక్షులు కోండ్రు శ్యాం బాబు మాట్లాడుతూ ప్రభుత్వం సిపి ఎస్ విధానంపై అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని ఖం డి స్తూ ప్రభుత్వం ఏప్రిల్ ఏడో తారీఖు జరుపు చర్చల లో సిపిఎస్ సంఘాలు లేకుండా కేవలం ప్రభుత్వ అ నుకూల సంఘాల తోనే చర్చలు జరపాలని నిర్ణ యించ డం యావత్ ఆంధ్ర రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగు లను అవ మానపరచడమే అన్నారు రాజస్థాన్ తరహాలో ప్రభు త్వం తక్షణమే సి పీ ఎస్ విధానాన్ని రద్దు పరిచి, సిపి యస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలుచేసి, ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన రీతి గా సిపిఎస్ ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## రుద్ర భూమి సాధకులకు సన్మానం



గోకవరం విలేఖరి ప్రజా పాలన ఏప్రిల్ 3 :గోకవరం గ్రామం లోని కైలాస భూమి ఆవరణలో నేడు కైలాస భూమి సాధకులకు శ్రీ సుంకర రమణ అండ్ సావిత్రమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీమతి సుంకర శ్రీవల్లి వీరబాబు దంపతులచే ఘనంగాసన్మానం చేయడం జరిగినది.కైలాస భూమిని సాధించడానికి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నిర్మించుకుని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఎంతో శ్రమించిన సాధకులకు ఘనంగా సన్మానం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు మాట్లాడుతూ కైలాస భూమిని ఏ విధంగా సాధించుకున్నాం, ఏవిధంగా నిర్మించుకుని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు అనే విషయాన్ని భావోద్వేగ భరితంగా వివరించారు.ఆహ్వానితుల కరతాళ ధ్వనుల మధ్య కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు.సుమారు 35 మంది కైలాస భూమి సాధకులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో దాసరి తమన్న దొర,గాజింగం సత్తిబాబు,సుంకర రమణ, దాసరి రమేష్,దాసరి సతీష్ వరసాల ప్రసాద్,పాటి రాంబాబు,గుల్ల ఏడుకొండలు,తోలేటి రాంప్రసాద్,ఎంపీడీవో కిషోర్ కుమార్,పంచాయతీ సెక్రటరీ టంకాల శ్రీనివాస్ . తదితరులు పాల్గొన్నారు

## పెద్ద మనసు చేసుకున్న సర్పంచ్ జ్యోతి బ్రహ్మాం



పెనుగంచిప్రోలు ఏప్రిల్ 3 ప్రజాపాలనా ప్రతినిధి:అనిగండ్ల పాడు గ్రామం నకు చెందిన చెవుగాని విజయ లక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు ఖ మ్మం హాస్పిటల్ చేరిన విషయం తెలుసుకొన గ్రామం సర్పంచ్ బి. జ్యోతిబ్రహ్మాం ఎంత సహృదయంతో హా స్పిటల్ కి వెళ్లి పరామర్శించి ఆమెకి వచ్చే వికలాంగు ల పెన్షన్ ను ఆమెకు అందజేశారు గ్రామ సర్పంచ్ యొక్క సహృదయానికి చెవుగాని విజయలక్ష్మి మరి యు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియ జేశారు.

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.
ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 1. డాక్టర్ కె వరప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్, స్నేహ క్లబ్ గవర్నర్,బాపట్ల, | Rs 1,000/- |
| 2. మండే ప్రభాకర్ రావు, జడ్పీ స్కూల్ అసిస్టెంట్, బాపట్ల, | Rs 1,000/- |
| 3. గోగులమూడి మరియన్న, హైదరాబాద్ | Rs 1,000/- |
| 4. జి రవి, మౌలాలి, హైదరాబాద్ | Rs 2,000/- |
| 5. దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, మంథని నియోజక వర్గ శాసనసభ్యులు మరియు మాజీ మంత్రి | Rs 50,000/- |
| 6. గూడూరు సీతామహాలక్ష్మి , PARS ఏపీ స్టేట్ ఇంచార్జ్ &CWC మెంబర్ అఖిల భారత అవయవ శరీర దాతల సంఘం వ్యవస్థపకురాలు, SPECT చైర్మన్. | Rs 1,00,000/- |
| 7.మండపాటి పరమనందకుమార్, అంబేద్కర్‌సేవ సమాజం. | Rs 2,000/- |
| 8.బండి ప్రేమ కుమారి, బాపట్ల | Rs 1,000/- |
| 9.నాగేంద్ర నాయక్, PARS కడప,రాజంపేట ఇంజనీర్స్ విభాగం సెక్రటరీ | Rs 1,000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు
మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

# ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 04, ఏప్రిల్ 2022


## జవాబుదారీతనం ఏదీ?

నేరగాళ్లను సత్వరం పట్టుకునేందుకు, నేరాలను సమర్థంగా అరికడుతుందని చెబుతూ మొన్న సోమవారం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన నేర శిక్షాస్మృతి(గుర్తింపు) బిల్లుకు సహజం గానే తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఈ బిల్లు రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన హక్కులను బేఖాతరు చేస్తున్నదని విపక్షాలు ఆరోపించడంతో బిల్లు ప్రవేశానికి ఓటింగ్ నిర్వహించాల్సివచ్చింది. ప్రభుత్వానికి మెజారిటీ ఉంది గనుక బిల్లు సభాప్రవేశం చేసింది. సమాజంలో నేరాలు పెరుగుతూ పోవడం, నేరగాళ్లు తప్పించుకు తిరగడం ఆందోళనకరమే. అందులో సందేహం లేదు. దేశానికి కొత్త కొత్త రూపాల్లో సవాళ్లు ఎదురవుతున్నప్పుడు కఠిన చట్టాలు అవసరమే కావొచ్చు. కానీ తగిన చట్టాలు లేకనే పరిస్థితులు దిగజారుతున్నాయని ఎవరైనా భావిస్తే పొరపాటు. దర్యాప్తు విభాగాల పని తీరు నాసిరకంగా ఉండటం, ఆ విభాగాలపై రాజకీయ పరమైన ఒత్తిళ్లుండటం అందుకు కారణాలు. మరోపక్క చట్టాల ప్రకటిత లక్ష్యాలను గాలికొదిలి ప్రభుత్వాలు వాటిని దుర్వినియోగం చేసిన సందర్భాలు కోకొల్లలు. నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికతలను వినియోగించుకోవడానికి, సత్వరం నేరాల గుట్టు వెలికితీయడానికి తాజా బిల్లులో నిబంధనలు రూపొందించామని ప్రభుత్వం అంటోంది. ఇప్పటికే అమల్లో ఉన్న 1920 నాటి ఖైదీల గుర్తింపు చట్టం స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఈ బిల్లు ప్రవేశపెట్టారు. అయితే నేరాలను అరికట్టేందుకు తీసుకొచ్చే బిల్లులు ప్రవేశపెట్టినప్పుడు చట్టసభల్లో ప్రభుత్వాలు చేసే గంభీరమైన ఉపన్యాసాలకూ, ఆ బిల్లుల్లో పొందుపరిచే వాస్తవాంశాలకూ తరచుగా సంబంధం ఉండదు. చట్టాలు దుర్వినియోగం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నా మని ప్రతిసారీ ప్రభుత్వాలు చెబుతాయి. ఈ విషయంలో ఈ దేశ పౌరులకు కావలసినంత అనుభవం ఉంది. ఇందిరాగాంధీ హయాంలో 1980లో వచ్చిన జాతీయ భద్రతా చట్టం(నాసా), 1985లో రాజీవ్‌గాంధీ హయాంలో తెచ్చిన ఉగ్రవాద, విచ్ఛిన్నకర కార్యకలాపాల నిరోధక చట్టం(టాడా), 2002లో వాజపేయి హయాంలో ఎన్‌డీఏ సర్కారు తీసుకొచ్చిన ఉగ్రవాద నిరోధక చట్టం(పోటా) ఇందుకు ఉదాహరణలు. టాడా దుర్వినియోగంపై తీవ్ర ఆరోపణలు రావడంతో దాన్ని పునరుద్ధరించరాదని 1995లో అప్పటి పీవీ ప్రభుత్వం నిర్ణయించింది. 2004లో యూపీఏ సర్కారు పోటా చట్టాన్ని రద్దు చేసింది. వీటిన్నిటికన్నా ముందే 1967లో ఇందిర ప్రభుత్వం తీసు కొచ్చిన చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ) 2012లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం, ఆ తర్వాత 2019లో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిన సవరణలతో మరింత పదును తేలి ప్రస్తుతం అమలవుతోంది. ఈ చట్టాలన్నీ నేరగాళ్లని భావించినవారిని దీర్ఘకాలం జైళ్లలో ఉంచేందుకు తోడ్పడ్డాయి. వేలాదిమంది అమాయకులు జైళ్ల పాలయ్యారని విమర్శలు వెల్లువెత్తగా, కఠినశిక్షల మాట అటుంచి అత్యధిక కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదలయ్యారు. రాజకీయ అసమ్మతిని అణచి వేసేందుకూ, ప్రజలను భయపెట్టేందుకూ ప్రభుత్వాలు ఈ చట్టాలు తెస్తున్నాయని బిల్లులపై చర్చ జరిగినప్పుడల్లా విపక్షాలు విమర్శించేవి. 1967లో యూఏపీఏపై వాజపేయి విమర్శ ఇక్కడ ప్రస్తావనార్హం. దేశ ప్రజల్లో నమ్మకం కోల్పోయిన గుప్పెడుమంది ఈ చట్టాన్ని తీసుకొస్తున్నారని ఆయన విమర్శించారు. భీమా కోరెగావ్ కేసులో అదే చట్టంకింద అరెస్టయి మూడేళ్లుగా జైళ్లలో మగ్గు తున్న మేధావులు, రచయితల పరిస్థితి చూస్తే చట్టాల అమలు ఎలా ఉంటున్నదో అర్థమవుతుంది. నేర శిక్షాస్మృతి బిల్లు చట్టమైతే శిక్షపడిన ఖైదీలనుంచి మాత్రమేకాక అరెస్టయినవారి నుంచి, ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నవారి నుంచి, 'ఇతరుల నుంచి' భౌతిక, జీవసంబంధ నమూ నాలు సేకరించవచ్చు. 'ఇతరుల' కింద ఎవరినైనా చేర్చవచ్చు. అంటే లాకప్‌లోకి వెళ్లాల్సివచ్చిన ప్రతి ఒక్కరి నుంచీ నమూనాలు సేకరించే అధికారం ప్రభుత్వాలకు దఖలు పడుతుంది. ఈ 'నమూనాల' పరిధిలోకొచ్చేవి ఏమిటన్న వివరణ లేదు. ప్రస్తుత చట్టంలో వేలి ముద్రలు, కాలి ముద్రలు మాత్రమే తీసుకోవచ్చు. ఆ నిబంధన కూడా శిక్ష పడినవారికే వర్తిస్తుంది. జీవసంబంధ నమూనాలంటే రక్తం, జుట్టు, డీఎన్ఏ, ఐరిస్ వగైరాలు ఏమైనా ఉండొచ్చు. పైగా ఈ సేకరణకు ప్రస్తుతం మేజిస్ట్రేట్ అనుమతి అవసరం అవుతుండగా... తాజా బిల్లు చట్టమైతే రాష్ట్ర ప్రభుత్వాధి కారి అనుమతి సరిపోతుంది. ఏం సేకరించాలో హెడ్ కానిస్టేబుల్ స్థాయి అధికారి నిర్ణయిస్తారు. సేకరణను ప్రతిఘటిస్తే మూడునెలల జైలుశిక్షను ప్రతిపాదించారు. న్యాయవ్యవస్థ అదుపూ, అజమాయిషీ ఉన్న చట్టాలే దుర్వినియోగమవుతున్న ఉదంతాలు కోకొల్లలుగా కనబడుతుండగా... ఆమాత్రం రక్షణ కూడా లేని చట్టాలు చివరకు ఎటు దారితీస్తాయో సులభంగా గ్రహించవచ్చు. పైగా సేకరించిన నమూనాలు దుర్వినియోగం కావన్న గ్యారెంటీ ఏమీ లేదు. అసలు మైనర్ల నుంచి ఇలా సేకరించవచ్చునా అన్న వివరణ లేదు. మన దేశంలో డేటా పరిరక్షణ గాల్లో దీపంగా ఉన్న వర్త మానంలో సేకరించిన నమూనాలు దారి తప్పితే? జవాబుదారీతనం నిర్ణయించకుండా, బాధ్యులకు శిక్షేమిటో చెప్పకుండా వదిలేస్తే పౌరుల గోప్యత ఏం కావాలి? వారికి లభించే ఉపశమన మేమిటి? నేరాలను అరికట్టాల్సిందే. సమాజంలో అశాంతి సృష్టించే శక్తుల ఆటకట్టాల్సిందే. కానీ ఆ పేరు మీద తీసుకొచ్చే చట్టాల్లో స్పష్టత లోపిస్తే, ప్రభుత్వాలకు జవాబుదారీతనం లేకుంటే అది అంతిమంగా నియంతృత్వానికి దారితీస్తుంది. ప్రజాస్వామ్య వ్యవస్థకు శరాఘాతమవుతుంది.

# అన్యాయ యుద్ధం, అనుకూల పరిణామాలు



మాతో ఉన్నారా సరే, లేదంటే టెర్రరిస్టులతో ఉన్నట్టే- అని జార్జి బుష్ జూనియర్ 2001లో మహాభవనాల జంట విధ్వంసానికీ, ఆఫ్ఘనిస్తాన్ మీద దాడికి మధ్య అన్నారు. ఈ వ్యక్తీకరణ ఆయన సొంతమేమీ కాదు, బైబిల్‌లో దేవపుత్రుడే ఆ మాట అన్నాడు, ఎందరెందరో రచయితలు, నాయకులు, తాత్వికులు గతంలో ఆ మాటలన్నారు. దాదాపు అదే సమయంలో హిల్లరీ క్లింటన్ కూడా కొంచెం అటూ ఇటూగా అదే మాట అన్నారు. అయినా, ఆ మాటకు కాపీరైటు, పేటెంటు అన్నీ బుష్ దొరగారికే దక్కాయి. అమెరికాలో రిపబ్లికన్లు, డెమొక్రాట్లూ అంతిమ పరిశీలనలో ఒకటే అయినా, వారి మధ్య ఉన్న చిన్న చిన్న తేడాలలో వాచాలత్వం ఒకటి. అమెరికన్ రిపబ్లికన్ల కంటె, డొనాల్డ్ ట్రంపు కంటె కూడా పరమ నాటు మనిషి ఎవరైనా ఉన్నారా అంటే, ఆయన పేరు వ్లాదిమీర్ పుతిన్. రష్యాకు చిరకాలపు అధ్యక్షుడు. అందరికంటె, ట్రంపుకు ఆత్మీయంగా నిలిచినవాడు కూడా అతనే. ట్రంపును మొదట గెలిపించింది పుతినే అన్న చర్చ తెలిసిందే కదా, రెండోసారి కూడా గెలిపించాలని చూశారు కానీ విధి వక్రించింది. (నరేంద్రమోదీ కూడా ట్రంపు గెలవాలని ఆశించి కొంత మాటసాయం చేయడం గురించి ఇక్కడ పెద్దగా చెప్పుకోనక్కరలేదు, ముగ్గురూ ముగ్గురికి అభిమానులే అన్న నిర్ధారణ మరీ అన్యాయమైంది అవుతుందేమో?) నా వైపు ఉండండి అని పుతిన్ ఎవరినీ అభ్యర్థించలేదు. మిత్రుడూ శత్రువూ అనే వర్గీకరణ ఏదీ చేయలేదు. నేను ఓ దేశం మీద దాడి చేస్తున్నాను, అడ్డం వచ్చారంటే ఖబడ్దార్ అన్నాడు. అణ్వాయుధాలను యుద్ధనౌకల మీద రఖిలిపిస్తూ ప్రపంచానికి గుబులు పుట్టిస్తున్నాడు. ఇంత సుతిమెత్తటి సున్నితమైన దేశాధినేత, రెండవ రాకడ జరుగుతున్న రష్యన్ సామ్రాజ్యవాదానికి ప్రతినిధిగా ఇప్పుడు జెండా ఎగరేస్తున్నాడు. కొత్తా దేవుడండీ. ఇటువంటి జబర్దస్తీ జరుగుతుండగా, ఎవరి పక్కన ఉండాలో ఎంచుకోవడం కష్టమే. అలీనవిధానం అంటే గోడమీద పిల్లి వాటం కాదు. పెద్ద పెద్ద దేశాలకు తోకలుగా మారకుండా, సొంత అస్తిత్వాన్ని నిలుపుకోవాలనుకునే దేశాల ఉద్యమం అది. కానీ, బలహీనుల మీద బలవంతుడు దాడి చేస్తుంటే తటస్థంగా ఉంటాననడం అలీనవాదం కాదు. ఈ సందర్భంలో తటస్థత అంటే బలవంతుడి పక్షాన నిలవడమే. అందుకే, ఇండియా చేసిన గైర్హాజరీని రష్యా మెచ్చుకున్నది. భారత్ విధానాన్ని అమెరికా కూడా 'అర్థం' చేసుకున్నది. అమెరికా జేబులో ఉన్నదనుకున్న పాకిస్థానే తటస్థత పేరుతో రష్యా వైపు మొగ్గుతుండగా, భారత్‌ను అమెరికా ఎట్లా తప్పుపట్టగలదు? ప్రపంచం అమెరికా, సోవియట్ శిబిరాలుగా ఉండిన ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో, కాంగ్రెస్ తాను సోషలిస్టుగా భ్రమింపజేస్తూ సోవియట్ శిబిరం వైపు మొగ్గు చూపుతుంటే, భారతీయ జనతాపార్టీ పూర్వ రూపం జనసంఘ్ అమెరికా అనుయాయిగా ఉండేది. సోవియట్ యూనియన్ విచ్ఛిత్తి, మొదటి గల్ఫ్ యుద్ధమూ ఒకేసారి జరిగాయి. అదే సమయంలో, మన ఆర్థిక విధానాలూ మారిపోయాయి. మొదటి గల్ఫ్ యుద్ధంలో కానీ, రెండో గల్ఫ్ యుద్ధంలో కానీ, భారత్ అంతర్జాతీయవేదికల మీద అసమ్మతిని ప్రకటించింది లేదు. కశ్మీర్ విషయంలో ఉక్రెయిన్ వైఖరిని ప్రస్తావించి, ఆ దేశానికి భారత్ మద్దతు ఇవ్వకూడదు అని కొందరు వాదిస్తున్నారు కానీ, అదే ప్రమాణమైతే, కశ్మీర్ వివాదంలో భారత్ వైఖరికి మద్దతుగా నిలిచినవాడు సద్దాం హుస్సేన్. అతనికి మాత్రం భారత్ ఏమాత్రం కృతజ్ఞత చూపింది? అతన్ని ఉరితీసినప్పుడు దురదృష్టకరమనడం తప్ప? ఇరాక్ విషయంలోనే కాదు, ఆఫ్ఘనిస్తాన్, లిబియా, సిరియా, ఇరాన్ దేశాలపై యుద్ధాలూ, ఆంక్షలూ ముసిరినప్పుడు, ఎక్కడా అభ్యంతరం చెప్పిన దేశం కాదు భారత్. వీటిలో చాలా వరకు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో తీసుకున్న వైఖరులే కాబట్టి, ఇప్పుడు నరేంద్రమోదీ చేసినది కొత్త తప్పూ కాదు, కొత్త ఒప్పూ కాదు. కాకపోతే, గల్ఫ్ నుంచి పెద్దసంఖ్యలో భారతీయులను సురక్షితంగా స్వదేశం రప్పించడానికి అప్పటి కేంద్రప్రభుత్వాలు ఎంతో శ్రద్ధ తీసుకున్నాయి. యుద్ధం రానున్న దేశాల ప్రభుత్వాలూ సహకరించాయి. ఇప్పుడేమిటో, బాధిత దేశమూ సాయపడలేకపోతోంది, దాడి చేసే దేశమూ దయచూపలేకపోతోంది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఈ పరిస్థితిని ఎంతగా ఉపయోగించాలనుకుంటున్నా, నరేంద్రమోదీకి పరిస్థితులు అనుకూలించడం లేదు. అమెరికా ప్రోత్సాహంతో చైనాతో ఢీ కొట్టడానికి కూడా సిద్ధపడి, ఇప్పుడేమో చైనా బలపరుస్తున్న రష్యాకు, అదిన్నీ అమెరికా ప్రయోజనాలకు భంగకారి అయిన దాడికి పరోక్షంగా మద్దతు ఇవ్వవలసి రావడం విధి వైపరీత్యమే. ఉక్రెయిన్ భారతదేశానికి చాలా కావలసిన దేశమే. ఆ దేశం నుంచి, ఆ దేశం ద్వారా మనకు చాలా దిగుమతులున్నాయి. మన దేశం నుంచి వెళ్లి విద్యార్థులు వైద్యవిద్య చదువుకోవడం ఆ దేశానికి మంచి వ్యాపారం. సోవియట్ యూనియన్ విభాగం తరువాత, ఆయా దేశాలలో చాలా మార్పులు జరిగాయి. వ్యవస్థలు మారాయి, అంతరాలు పెరిగాయి, కొత్త సంస్కృతి కొత్త రుగ్మతలను తెచ్చింది. రష్యాలో మాఫియా, శరీర వ్యాపారం, చైల్డ్ పోర్నోగ్రఫీ పెరిగినట్టే, తక్కిన మాజీ రిపబ్లిక్‌లలోనూ శాయశక్తులా ఏవో దుర్మార్గాలు పెరిగాయి. దుబాయితో సహా పర్యాటక ఆకర్షణలున్న గల్ఫ్ దేశాలలో అనేక మంది ఉక్రెయిన్ అమ్మాయిలు లైంగిక సేవలు అందించే వృత్తుల్లో కనిపిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయనేతలు అనేకులు గల్ఫ్ దేశాలకు ఎందుకు వెడతారో బహిరంగ రహస్యమే. నేపాల్ మాదిరిగా భారత్ కూడా ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తే, ఒక సైద్ధాంతిక ప్రాతిపదిక మీద మాత్రమే ఇవ్వాలి. చిన్న దేశంమీద పెద్ద దేశం, చర్చల ద్వారా కాకుండా దౌర్జన్యాన్ని ఆశ్రయించి, మొదట దాడి చేయడం అన్న కారణంతో చేయాలి. అటువంటి సూత్రబద్ధ వైఖరి గతంలో కూడా లేదన్నసంగతి చూశాము. ఇప్పుడు కొత్తగా ఆ వైఖరి తీసుకోవడం వల్ల, ఆసియా, ఐరోపా ఖండాలలో రూపొందుతున్న సరికొత్త భద్రతా చిత్రపటం మీద భారత్ ఏకాకి అవుతుంది. రష్యా మీదకు ఉక్రెయిన్‌ను ఎగదోసిన అమెరికాయే రంగంలోకి దిగడానికి సంశయించే పరిస్థితి ఉంటే, రేపు చైనాతో ఏదైనా సమస్య వస్తే, మన తరపున మాట్లాడేవాడు కూడా లేకుండా పోతారు. అందుకే, ఒకనాడు ప్రారంభించి, తరువాత నిద్రాణం చేయతలపెట్టిన బ్రెజిల్, రష్యా, చైనా, ఇండియా, దక్షిణాఫ్రికా కూటమి స్ఫూర్తికి కొంత ప్రాణం పోశారు. ఈ మధ్య కాలంలో హడావుడి చేస్తున్న ఇండో పసిఫిక్ ప్రాంత భద్రతా కూటములు, ప్రయత్నాలు ప్రస్తుతానికి అటకెక్కవలసిందేనేమో? భద్రతావ్యూహాత్మక కారణాలతో అనివార్యమైన దాడి చేయడం సహేతుకమే అని వాదిస్తున్న రష్యా, రేపు భారత్‌కు కానీ, చైనాకు కానీ అటువంటి సదుపాయాన్ని అనుమతిస్తుందా అన్నది సందేహమే. ఆ పరిస్థితి వచ్చినప్పుడు, రష్యా అమెరికా కలసి తమ ప్రయోజనాల రీత్యా అంచనాలు వేసుకుంటాయి కాబోలు. అప్పుడు మరొక సంక్షోభం వచ్చి, మరొక పునరేకీకరణ అవసరం కావచ్చు. మూడు దశాబ్దాలుగా తూర్పు యూరప్‌ను కొద్దికొద్దిగా కొరుక్కుతింటున్న అమెరికాకు ఇప్పుడు బ్రేక్ పడింది. రష్యాతోను, చైనాతోనూ కలసి ప్రపంచాన్ని పంచుకోవలసిందే కానీ ఏకఛత్రాధిపత్యం కుదరదని ప్రస్తుత పరిణామాలు సూచిస్తున్నాయి. అది మంచిదే కదా? ఏకధ్రువ ప్రపంచం కంటె, ఇద్దరు ముగ్గురు దొరల ప్రపంచంలో, బలహీనులకు కాస్త వెసులుబాటు ఉంటుంది. అన్నిటికంటె, సానుకూల పరిణామం, ఈ యుద్ధంలో అంతర్జాతీయ ఉగ్రవాదం అనే భూతం లేదు. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచంలో జరిగిన యుద్ధాలు, పోరాటాలు అన్నీ ఇస్లామిక్ ఉగ్రవాదం చుట్టూ తిరిగాయి. ఇది ఒకే మతానికి చెందిన రెండు దేశాల మధ్య పోరు. సెక్యులర్ యుద్ధం ఇది. అంతర్జాతీయ ఉగ్రవాదం బూచితో, దేశదేశాలలో విస్తరిస్తున్న మెజారిటేరియన్ తీవ్రజాతీయవాదానికి ఈ పరిణామం విఘాతం కలిగించవచ్చు. కనీసం అంతర్జాతీయ ప్రోత్సాహం తగ్గిపోవచ్చు. భారత్ వంటి దేశాలలో ఇది సానుకూల పరిణామాలకు దోహదం చేయవచ్చు. నయా నాజీవాదులు అని ఉక్రెయిన్ పాలకులను పుతిన్ అంటున్నాడు కానీ, అతని ఇటీవలి ప్రసంగాలు వింటుంటే, పూర్వపు రష్యా సామ్రాజ్యాన్ని తిరిగి స్థాపించడానికి అతి మితవాద జాతీయవాదాన్ని తప్పక ఆశ్రయిస్తాడనిపిస్తోంది. కాకపోతే, దాని ప్రాతిపదిక మతం కాదు. మునుపటి యుద్ధాల కాలంలో సామాజిక మాధ్యమాలు పెద్దగా లేకపోవడం వల్ల, అందరికీ వైఖరులు తీసుకోవలసిన అవసరం లేకపోయేది. ఇప్పుడు ఉక్రెయిన్ మీద రష్యా దాడి మీద మాట్లాడవలసిన అవసరం వచ్చిపడింది. మీడియా చూస్తేనేమో, పశ్చిమ దేశాల వార్తాసంస్థలు గుమ్మరించే సమాచారంతో స్పందనలను రూపొందించుకుంటోంది. రష్యాకేమో గ్లోబల్ మీడియాను ప్రభావితం చేసే శక్తి రాలేదు. గూగుల్, ఫేస్‌బుక్ సహా మనోభావాల వ్యాపారాలు చేసే సంస్థలన్నీ రష్యా వ్యతిరేక వైఖరి తీసుకున్నాయి. మనం వింటున్నవి, రాస్తున్నవి, చదువుతున్నవి అనేకం, అమెరికా పక్షం రూపొందించి వదిలినవి. సహజ లోకజ్ఞానంతో, ఉద్యమాలు, పఠనం, వివేచన ఆధారంగా కొందరు మంచిచెడ్డలు చెబుతున్నారు కానీ, విపరీత వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇది అంత తొందరగా నిర్ధారణ చేసే అంశం కాదు. యుద్ధ వ్యతిరేకత ఒక్కటే సరిపోదు. అట్లాగే, అమెరికా వ్యతిరేకతా సరిపోదు. సమస్యలోని సంక్లిష్టతను యథాతథంగా గుర్తించడమే చేయవలసిన పని. సాధ్యమైనంత ప్రాప్తకాలజ్ఞత ప్రదర్శించి, తగినంత మనుగడను, భవిష్యత్తును మిగుల్చుకోవడమే మన వంటి దేశాలు చేయవలసిన పని. మహాశక్తుల ఘర్షణలో తలదూర్చకుండా, వాటి వైరుధ్యాల నుంచి లాభపడడం ఎట్లాగో, ఆ మార్గాన్ని దేశభక్తులైన పాలకులు అనుసరించాలి. మారుతున్న ప్రపంచపటం చూడండి. ఒకనాటి రవి అస్తమించని సామ్రాజ్యం ఒక చిన్న ఐరోపా రాజ్యంగా మారడాన్ని చూశాము. ప్రపంచాన్ని గడగడలాడించిన అమెరికా రానున్న దశాబ్దాలలో ఒకానొక అగ్రరాజ్యంగా మాత్రమే, కోరలు తీసిన పాములా మారిపోవడం చూస్తామేమో?

## ఈ చీకటికావల ..



వీళ్లు ..
నా కళ్లను
కాల్చిన ఇనపచువ్వలతో పీకేసారు !

ఈ చీకటికావల
వీళ్లు దోచుకున్న వెలుగురాశిని
నీకు చూపిస్తానేమోననీ ..!
వీళ్లు ..
నిషేధం నిట్టకు
నా పెడరెక్కలు విరిచి కట్టేసారు !
ఇంతటి విధ్వంసంలోకి
మనల్ని నడిపిస్తున్న నియంతల
పాదముద్రల్ని నీకు చూపిస్తానేమోననీ ..!

ఐనా .. దిగులు పడకు !
రేపటి తూరుపు తావి మీద
సూరీడికి బదులు
వీళ్లు ఖండించిన నా శిరస్సు విరబూస్తుంది

ఆ వేళ ..
నేనే వెలుగు రెక్కలతో
నీ ముంగిట వాలతాను!

**– సిరికి స్వామినాయుడు**

## దగ్గరలోనే....

వాళ్ళు గెలుస్తూనే వున్నారు
ప్రజలు ఓడిపోతూ వున్నారు
మెదడును మార్చే మత్తు మందు చల్లి
వాళ్ళు గెలుస్తూనే వున్నారు
ప్రజలు వంచించబడుతూ వున్నారు

ఒకరిపై ఒకరికి అపనమ్మకం పెంచుతూ
వాళ్ళు గెలుస్తూనే వున్నారు
ప్రజలు మోసపోతూ వున్నారు
విగ్రహాలెత్తు పెంచుతూ
వాళ్ళు గెలుస్తూనే వున్నారు
ప్రజలు దగా పడుతూ వున్నారు

ఏదో ఒక బూచిని చూపెడుతూ
వాళ్ళు గెలుస్తూనే వున్నారు
ప్రజలు మరల ఓడిపోతూ వున్నారు
కానీ అక్కడో ఇక్కడో



ప్రజలు ఒక్కటవుతున్నారు
రెప్పలపై మాయ పొరలు తెగ్గోసి
విజయం వైపు అడుగులు వేస్తూ వున్నారు!

**– కెక్యూబ్**

## గ్రామాలలో విస్తృతంగా పర్యటించిన డా.చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట.ఏప్రిల్ 3.(ప్రజాపాలన ప్రతినిధి) :రొంపిచర్ల మండలంలో అన్నవరం, తుంగపాడు,సంతగుడిపాడు గ్రామాలలో శనివారం రాత్రి నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్-చార్జ్ డా.చదలవాడ అరవింద బాబు పర్యటించారు.ఆయా గ్రామాలకు విచ్చేసిన ఆయనకు టిడిపి నాయకులు,కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తలను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంతగుడిపాడు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తలు జాన్ భాషా,గాజుల మీరాహుస్సేన్, షేక్ బుజ్జాయి,నూతలపాటి నాగూర్ వలి లను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని వారందరికీ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ విధంగా అనారోగ్యం తో బాధపడుతున్న టిడిపి కార్యకర్తలను పరామర్శించి ఆర్ధిక సహాయం అందజేసిన డా.చదలవాడ అరవింద బాబును టిడిపి నాయకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు వెన్న బలకోటి రెడ్డి,జగ్గయ్య,సురేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ తో చికిత్సపొందుతున్న విద్యార్థికి నగదు వితరణ





పొన్నూరు ఏప్రిల్03 (ప్రజా పాలన ప్రతినిధి) :క్యాన్సర్ వ్యాధి బారినపడిబాధపడుతూ చికిత్స పొందుతున్న పొన్నూరు కు చెందిన మహమ్మద్ జావేద్ అక్తర్ కు పొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992 పదో తరగతి పూర్వ విద్యార్థుల సంఘం తరఫున ఆదివారం రూ .53,735 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మహమ్మద్ జావేద్ అక్తర్ గత కొద్ది కాలంగా బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతు విజయవాడ మణిపాల్ హాస్పిటల్ కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఇతని దీన పరిస్థితిని తెలుసుకున్న 1992 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సంఘం తరఫున ఆర్థిక సహాయాన్ని ఆయన తండ్రి మహమ్మద్ రబ్బాని అందజేయడం జరిగింది. జావిద్ అక్తర్ ఆర్థిక సహాయాన్ని అందజేసిన వారిలో షేక్ షఫాయతుల్లా, కే శ్రీనివాస్, షేక్ మౌలా, షేక్ జానీ, షేక్ కరామతుల్లా, చెంచులు, షేక్ బషీర్, షేక్ చాంద్ బాషా తదితరులు ఉన్నారు. అదేవిధంగా మహమ్మద్ జావిద్ అక్తర్ కు తజ్మల్ బేగ్ యూత్ రూ. 11,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థిక సహాయాన్ని అందజేసిన వారిలో ఇక్బాల్ బేగ్, ఎండి మునీర్, నయీమ్ భాష, షేక్ ముస్తాక్ తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి పాఠశాలలకు ఒంటిపూట బడులు ప్రారంభం



పొన్నూరు ఏప్రిల్03 (ప్రజా పలన ప్రతినిధి) వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నాలుగవ తారీకు నుండి ఒంటిపూట బడులు ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో పొన్నూరు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. మధ్యాహ్న భోజనం యధావిధి గానే నిర్వహిస్తామని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పాఠశాలలు ఉదయం 7.30ల నుండి 11.30ల వరకు జరుగునని తెలిపారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి ఉండాలి



పొన్నూరు ఏప్రిల్03 (ప్రజా పాలన ప్రతినిధి) : తెలుగు సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా నిడుబ్రో పి బి ఎన్ కాలేజ్ రోడ్డులో విజయ్ సేవ ట్రస్ట్, మన పొన్నూరు బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. టోర్నమెంట్లో పాల్గొన్న విక్టరీ టీం, సి ఎఫ్ టీం క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా అవార్డు అందుకున్న జండా చెట్టు సచివాలయం సుభాని పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని తెలియజేశారు. పొన్నూరు దివ్యాంగుల మురుగుల సాంబశివరావు మాట్లాడుతూ విజయ సేవ ట్రస్ట్ మరిన్ని కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలని కోరారు. సెక్రటరీ రాంబాబు, విజయ్ బాపట్ల చల్ల రామయ్యలు మాట్లాడుతూ విద్యార్థులు ఎన్నో విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. మన పొన్నూరు బ్లడ్ డోనర్స్ ఉమా శంకర్, పాస్టర్ శ్యాం ప్రసాద్ నూర్ భాష అల్లాబక్షు , కే నవీన్ ,వాలంటరీ మౌలాలి, విష్ణు మన పొన్నూరు బ్లడ్ డోనర్స్ పెరవలి నరేంద్ర రూపేష్ పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుస్తాను: డా.చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట. ఏప్రిల్ 3.(ప్రజాపాలన ప్రతినిధి : వచ్చే ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా గెలుస్తానని నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్-చార్జ్ డా.చదలవాడ అరవింద బాబు అన్నారు.ఉగాది పర్వదినం సందర్భంగా మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం రాత్రి జరిగిన శ్రీ బాల త్రిపుర సుందరి సమేత శ్రీ శంకరస్వామి ఆలయ తిరునాళ్ళ మహోత్సవంలో పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన డా.చదలవాడకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గ్రామంలో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ఎలక్ట్రికల్ ప్రభ వద్దకు వచ్చి సాంస్కృతిక కార్యక్రమాలను పరిశీలించారు.ప్రభ వద్దకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పరిపాలనలో ప్రజల పై విపరీతమైన భారాలు మోపబడుతున్నాయని అన్నారు.ఉగాది కానుకగా జగన్ ప్రజలకు విద్యుత్ ఛార్జీలు మోత ఇచ్చారని ఎద్దేవా చేశారు.ఎన్నికలకు ముందు జగన్ ప్రజలకు ముద్దులు పెట్టి ఇప్పుడు భారాలు మోపుతున్నారని అన్నారు.జగన్ పరిపాలనలో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.జగన్ కి ప్రజలు ఒక్కసారి అవకాశము ఇస్తే వారి పై విపరీతమైన భారాలు మోపి బాదుతున్నారని ఆరోపించారు.జగన్ పరిపాలన అన్న క్యాంటీన్లు మూత, ప్రజా వేదిక కూల్చివేతతో ప్రారంభమైందని అన్నారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే పోలవరం పూర్తయి రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేదని అన్నారుఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి విభిన్న ప్రతిభావంతుల కార్పోరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు,మాజీ ఎంపీపీ మొండితోక రామారావు,టిడిపి మండల అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి పులుకూరి జగ్గయ్య,మండల నాయకులు పల్లెల గోవిందరెడ్డి, చిరుమామిళ్ళ బ్రహ్మయ్య,కోనేటి శ్రీనివాసరావు,కల్లి మల్లారెడ్డి,పల్లెల అంజిరెడ్డి,నెల్లూరి పాపారావు, మాదినీడి అంజయ్య,కల్లి శివారెడ్డి, పెద్దినీడి సుబ్బారావు,వడ్లమూడి శంకరయ్య,వెలమా పాపారావు, పొనుగోటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## అనన్య హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచితవైద్య శిబిరం విజయవంతం



నరసరావుపేట.ఏప్రిల్ 3.(ప్రజాపాలన ప్రతినిధి) :లిరొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనన్య హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో ఊపిరితిత్తులు ప్రత్యేక వైద్య నిపుణులైన డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ మరియు డాక్టర్ సింగర్ రాజు విద్య బిపి, షుగరు మరియు జనరల్ వైద్యనిపుణులు కలసి గ్రామంలోని 150 మందికి షుగర్, బిపి, ఈసీజీ మరియు శ్వాసకోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా సంతగుడిపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీమతి జ్యోతిర్మయి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తూ తమ గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందులను కూడా పంపిణీ చేస్తున్న డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ మరియు డాక్టర్ విద్య ను అభినందించారు. ఈ కార్యక్రమం జయప్రదం కావటానికి తోడ్పాటు అందించిన డాక్టర్ కోసూరి సుబ్బారావు గారికి మరియు గ్రామ పెద్దలు బండారుపల్లి నాగేశ్వరరావు, కల్లూరి ఆంజనేయులు, ఆకుల నాగేశ్వరరావు, వాకా రమణారెడ్డి మరియు సహకరించిన గ్రామ ప్రజలకు అనన్య హాస్పిటల్స్ వారు ధన్యవాదాలు తెలియజేశారులి

## గుంటూరుజిల్లా ఆర్యవైశ్య సంఘ ప్రమాణస్వీకార మహోత్సవంలో పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట.ఏప్రిల్ 3.(ప్రజాపాలన ప్రతినిధి) : నరసరావుపేట పట్టణంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ, గుంటూరుజిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకరమహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా అధ్యక్షులుగా అడ్డగిరి. వెంకటరామ ద్వారకా వాసు.. పట్టణ అధ్యక్షులుగా కొత్తూరి కోటేశ్వర రావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , ఎంపీ శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు , గుంటూరు తూర్పు ఎమ్మెల్యే శ్రీ మద్దాలి గిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంచి పనులు చేయాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో ఆర్యవైశ్యులే ముందుంటారని ప్రశంసించారు. రెడ్ క్రాస్, రోటరీ క్లబ్, లైన్స్ క్లబ్ తో పాటు ఇతర సేవా సంస్థల ద్వారా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గడియార స్తంభం ఏర్పాటు చేయడం జరిగిందని.. సేమ్ చేతుల మీదగా 6న ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలో.. ఓడించాలి అన్నా.. ఆర్యవైశ్యులే అన్నారు. వైసిపి ప్రభుత్వము వచ్చాక కార్పోరేషన్ ద్వారా రూ.915 కోట్లు ఆర్యవైశ్యులకు ఇస్తున్నామన్నారు. ఈబిసి నేస్తం కింద రూ.78,45, 75,000 మహిళల ఖాతాల్లో పడ్డాయని వివరించారు. చంద్రబాబు దేవాలయాలను కూల్చి వేస్తే.. జగన్ గారు దేవాలయాలను కడుతున్నారు అని అన్నారు. ఇస్సాపాలెం అమ్మవారి ఆలయాన్ని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఏర్పడిన తర్వాత వ్యాపార సంస్థలు మరింత అభివృద్ధి చెందుతాయి అన్నారు.

## బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు అందుకున్న హనుమాన్ జంక్షన్ సి ఐ కే సతీష్



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్03: హనుమాన్ జంక్షన్ సర్కిల్ పరిధిలో ఫోక్స్ యాక్ట్ కేసులను నిర్ణీత సమయం కన్నా ముందే విచారించి పరిష్కరించి ఎంతో చాకచక్యంగా వ్యవహరించేందుకు గాను కృష్ణా జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ హనుమాన్ జంక్షన్ సి ఐ కే సతీష్ ఆదివారం మచిలీపట్నంలో గల ఎస్పి కార్యాలయం క్వాటర్లీ క్రైమ్ మీటింగ్ కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు అనంతరం బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందజేశారు ఈ సందర్భంగా సిఐ సతీష్ మాట్లాడుతూ కృష్ణా జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ చేతులమీదుగా అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు ఉన్నతాధికారుల ఆదేశాలను తుచా పాటిస్తూ చేసే పనిపై ఇష్టంతో పాటు ప్రత్యేక శ్రద్ధ అవసరమని నావల్ల కాదు అని నిరుత్సాహపడకుండా నేను ఎందుకు చేయలేను అని కసి పట్టుదల ఉంటే విజయం మన వెంటే ఉంటుందని సీఐ సతీష్ తెలిపారు.

## బీసీ కుల గణన చేయాలి : కేసన



ప్రజాపాలన – నిజాంపట్నం : బీసీ కుల జనగణన చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా రాష్ట్ర ప్రభుత్వా నికి బీసీ కుల గణన చేసే అధికారం ఉందని, రాష్ట్రంలో బీసీ కుల గణన చేస్తే తక్షణమే దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కూడా ఉంటుందని ఆయన తెలిపారు.బీసీల కులగణనని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించటం అంటే బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల సౌకర్యాలు నిరాకరించటమేనని చెప్పారు.ఇప్పటికే బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించటం ద్వారా వివిధ కులాల మధ్య ఎలాంటి పొరపచ్చాలు వైషమ్యాలు ఏర్పడలేదన్నారు. బీసీల కులగణన చేస్తే వివాదాలు వస్తాయని చెప్పటం కేవలం కుంటి సాకు మాత్రమేనని, ఏ పత్రం అమలుకైనా కులాల వారీ సామాజిక ఆర్థిక జీవన స్థితిగతుల సర్వే నివేదిక అవసరం అవుతోందని చెప్పారు.బీసీల కులగణన లక్ష్య సాధనకు రాష్ట్రంలో ఐక్య ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు.అందులో భాగంగా గుంటూరులో రౌండ్ బుల్ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేసినట్లు పేర్కొన్నారు.ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిబా ఫులె జయంతి రోజున 13 జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడానికి ఒక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.అదేవిధంగా, ఊరేగింపులు, దీక్షలు, ధర్నాలు వంటి కార్యక్రమాలు జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలని నిర్ణయిం చామన్నారు.కుల గణన చేస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని అయన తెలియజేశారు.

## గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో దాతలు తమ వంతు సహకారం అందించాలి



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 03: నందివాడ మండలం శంకరం పాడు గ్రామ సిపిఎం పార్టీ మద్దతు సర్పంచ్ కైలె సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.శంకరంపాడు గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి సహకరించిన ధాత కోనేరు వెంకటేశ్వరరావును గ్రామస్తులతో కలిసి సర్పంచ్ సుబ్బారావు సత్కరించారు.దాత వెంకటేశ్వరరావు ఇచ్చిన ఐదు లక్షల విరాళంతో గ్రామంలో లో నీటి సమస్య పరిష్కారం అవుతుందని సర్పంచ్ సుబ్బారావు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం లతోపాటు దాతలు కూడా తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అడ్డగోలు పన్నుల భారం మోపడం దుర్మార్గం



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 03: గుడివాడ సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆర్ సి పి రెడ్డి మీడియాతో మాట్లాడారు. కరోనా విపత్కర పరిస్థితుల నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకు సహకారం అందించాల్సిన రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు వారిపై అడ్డగోలు పన్నుల భారం మోపడం దుర్మార్గమని ఆయన ఖండించారు. తెలుగు సంవత్సరాలు అయినా ఉగాది పండగ రోజు కూడా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే, కేంద్ర ప్రభుత్వం పెట్రోలు ఉత్పత్తుల ధరలు పెంచిందని ఆయన ధ్వజ మెత్తారు. ప్రభుత్వాలు తమ అడ్డగోలు విధానాలు మార్చుకోకుంటే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

## కలెక్టర్‌ను కలిసిన పామర్రు ఎమ్మెల్యే



పామర్రు ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 03: విజయవాడ నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహించి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ గా బదిలీపై వెళ్తున్న జె నివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసిన పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ , నందిగామ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు , ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ గారు,ఎమ్మెల్సీ తలశిల రఘురాం ... ..కృష్ణాజిల్లా కలెక్టర్ గా ఉత్తమ సేవలు అందించారని ,జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి మంచి కలెక్టర్ గా పేరు తెచ్చుకున్నారని జె నివాస్ గారిని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించారు ..

## సత్ప్రవర్తన తో మెలగకుంటే కఠిన చర్యలు తప్పవు: గన్నవరం సి.ఐ శివాజీ



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్03: గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీలు, కెడీలు, డిసి లు, లా అండ్ ఆర్డర్ మరియూ క్రైమ్ సస్పెక్ట్ లను మరియూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ కేసులు నమోదైన వ్యక్తులను సమావేశపరిచి గన్నవరం సిఐ కోమాకుల శివాజీ కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. షీట్ హోల్డర్ ప్రతీ ఒక్కరినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వారి పై గల కేసులు, షీట్ ఓపెన్ అయిన పరిస్థితులు పరిశీలించి, ప్రతీ ఒక్కరికీ తగు సూచనలు చేయడం జరిగింది. షీట్ హోల్డర్ ప్రతీ ఒక్కరూ విధిగా సత్ప్రవర్తన కలిగి ఉండాలనీ, చట్టవ్యతిరేక కార్యక్రమాలలో పాల్గంటే చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామని తెలియచేసారు. షీట్ హోల్డర్ ప్రతీ ఒక్కరి పై నిఘా ఉంటుందనీ, ఎవరైనా సూచనలు ఉల్లుఘించిన ఎడల వారి ప్రవర్తన ఆధారంగా నగర బహిష్కరణ కు సిఫార్సు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మరియూ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ పెట్టుబడగా కేసులు నమోదైన వ్యక్తులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ప్రతి ఒక్కరూ విధిగా చట్టానికి లోబడి ఉండాలని చట్టాన్ని ఉల్లంఘించడం, చట్టవ్యతిరేక కార్యకలాపాల లో పాల్గొనడం చేయటంవల్ల వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

# చక్కా వెంకట నాగ వరలక్ష్మి సేవాభావల సేవలు శ్లాఘనీయం



జగ్గయ్యపేట ఏప్రిల్ 03 ప్రజాపాలన ప్రతినిధి: పట్టణా నికి చెందిన శ్రీమతి చక్కా వెంకట నాగ వరలక్ష్మి ప లువురికి ఆదర్శమూర్తిగా, సేవాతత్పరాలుగా పేరు పొందిన ఆదర్శ వనిత.ఓరైతు కుటుంబంలో జన్మించి ,సాధారణ గృహిణిగా ఉంటూ సమాజంలోను అం చె లంచలుగా ఎదిగి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదిం చుకున్నారు.ఎవరికి తెలియని శ్రీమతి చక్కా వెంకట నాగ వరలక్ష్మి ఒక్కసారిగా 2020 లో సామినేని కుటుంబానికి విధేయులుగాను, చక్కా వెంకట కృష్ణ ప్ర సాద్ ఉండటం గుర్తించి స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ,ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిర్ణయం ప్రకారం నామినే టెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ ను దృష్టిలో ఉంచుకొని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ధర్మకర్తల మండలి సభ్యురా లుగా అవకాశం కల్పించారు.సాధారణ గృహిని గా తమ సంతానాన్ని ప్రయోజకులు గా చేసిన చక్కా వెంకట నాగ వరలక్ష్మి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వా మి పాలక మండలి సభ్యురాలుగా మంచి పేరు ప్రఖ్యాతలు సం పాదించుకున్నారు, ఈ సందర్భంగా తన కుమారుని చేత శ్రీమతి చక్కా వెంకట నాగ వరలక్ష్మి పేరు మీద ఓ సేవ ట్రస్ట్ ఏర్పాటు చేయించి అనేకమైన సేవా కా ర్యక్రమాలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పే ద ఆడబిడ్డల పెళ్లి కోసం మెట్టెలు, మంగళ సూత్రం అందజేస్తూ, ఆపదలో ఉన్నా పేద బ్రాహ్మణుడి కుటుం బానికి, పాత్రికేయ కుటుంబానికి ఆర్థిక సహాయం చేశా రు.ఇవే కాకుండా కులం,మతం మరియు ప్రాంతం చూడకుండా సహాయం కోరి తమ దృష్టి కి వచ్చిన ప్ర తి ఒక్కరికి తమ శక్తి కొలది సాయం చేస్తున్నారు , అం తేకాకుండా కరోనాతో ఇబ్బంది పడుతూ బయటకి రా లేని కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపించ డం, ఫ్రెంట్ లైన్ వారియర్స్ కు మరియు గరికపాడు చెక్ –పోస్ట్ వద్ద ఇబ్బంది పడుతున్న ప్రజలకు తమ సొంత ఖర్చుతో భోజన ఏర్పాట్లు చేయడం, దీనితో పాటు నెల్లూరు ఆనందయ్య మందును ఉచితంగా పంపిణీ చేశారు.ఇటీవల దసరా సందర్భంగా జరిగిన విజయవాడ ఇంద్రకీలాద్రి దసరా నవరాత్రి మహో త్స వాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం చేసుకునేలా, ఏర్పాట్లు చేసి ఎప్పటికప్పుడు భక్తులకు అందుబాటులో ఉంటూ భక్తులకు అవస ర మైనఅనేక రకమైన సౌకర్యాలుకల్పించారు. అన్న దానం, ఆర్థిక సహాయం, అనేక రకమైన వృద్ధాశ్రమాలు, అనాధ ఆశ్రమాలలో చక్కా వెంకట నాగ వర లక్ష్మి చేసి న సేవలు గుర్తించి నెల్లూరు విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ వారు జాతీయ స్టార్ మహిళ అవార్డు ను ఆ మె కు అందజేశారు, ఇలా రాష్ట్ర వ్యాప్తంగా అనేక రకాలై న సేవా కార్యక్రమాలతో మంచి పేరు సంపా దించుకు న్న జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన చక్కా నాగ వెంకట వరలక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు ప్రజలు తెలియజేశారు.

## పెదకాకాని లో 'చదవడం మాకిష్టం'... కార్యక్రమం



పొన్నూరు ఏప్రిల్03( ప్రజా పాలన ప్రతినిధి) :పెదకాకాని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం "చదవడం మాకిష్టం" కార్యక్రమం జరిగింది. గ్రామంలో15మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. వారిచే స్టోరీలు, పుస్తకాలు చదివించి, వారిచే చెప్పి%శీ%చటం జరిగినది. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని నిర్వాహకులు అన్నారు. తరగతి గదిలోని పుస్తకాలతో పాటు గ్రంథాలయంలోని అన్ని పుస్తకాలు చదువుతానని వారిచే ప్రతిజ్ఞ చేయించటం జరిగినది.తదుపరి విద్యార్థులు కు చిత్రలేఖనం పోటీలను నిర్వహించి పోటీలలో గేలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

## బార్ అసోసియేషన్ సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే కిలారి



పొన్నూరు ఏప్రిల్03 (ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు పట్టణ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పొన్నూరు శాసన సభ్యులు, రాష్ట్ర అధికార ప్రతినిధి కిలారి వెంకట రోశయ్య ను నూతనంగా ఎన్నికైన పొన్నూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనీ గల అంకమ్మరావు, తొ పాటు అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కార్యాలయంలో బార్ అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే కిలారి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ గోవిందమాల భక్తబృందం ఆధ్వర్యంలో పేదలకు అన్నవితరణ



విజయవాడ,ప్రజాపాలన:పేదలకు పరోపకారం చేసే అన్నదాతల సేవలు చిరస్మరణీయమని, దాతల సహకారం నిరుపమానమని శ్రీగోవిందమాల భక్తసమాజం గోవిందగురు స్వామి ఏనుగుల వెంకట గాంధీబాబు కొనియాడారు. ఈ మేరకు శనివారం గాంధీనగర్, రైల్వేస్టేషన్, బి.ఆర్.టీ.సీ రోడ్డు, వాంబే కాలనీ మాతృదేవో వృద్ధుల ఆశ్రమం నందు కమిటీ సభ్యులు భీమవరపు రవి కుమార్ రెడ్డి చేతులమీదుగా అన్నవితరణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వెంటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో, దాతల సహకారంతో గత సంవత్సరం కాలంగా కొన్ని వేలమందికి పైగా పేదలకు, బాలలకు, వృద్ధులకు అన్నవితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.దాత పరిమికాయల నిర్వాన్ కృష్ణ సహకారంతో అన్నవితరణ కార్యక్రమం చేశామని, పేదలకు పరోపకారం చేసే దాతలు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పుప్పాల అప్పారావు, గంజి సుధాకర్, సారంపాటి దుర్గాప్రసాద్, పరిశే శ్రీనివాసరావు, ఏనుగుల వెంకట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా మద్దిరాల వెంకటేశ్వరరావు (సాక్షి.టి.వి)తో పాటు 12 మంది సభ్యుల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నూజివీడు, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 03:కృష్ణాజిల్లా నూజివీడులో ఆదివారం ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా 2022–23 నూతన కార్యవర్గ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న పాత్రికేయబృందం.నూజివీడు" ప్రెస్ క్లబ్" కమిటీ అధ్యక్షులుగా మద్దిరాల వెంకటేశ్వరరావు (సాక్షి.టివి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న విలేకరులు. ఉపాధ్యక్షులుగా ఉమ్మా రవీంద్ర రెడ్డి(సాక్షి.ప్రింట్ మీడియా), ప్రధాన కార్యదర్శిగా నిమ్మగడ్డ రతీష్ బాబు(ఈనాడు. ప్రింట్ మీడియా). కార్యదర్శిగా రుద్రపాటి మణిక్యాలరావు.కోశాధికారిగా రూప్ప రామ్మోహన్ రావు.,కార్యవర్గ సభ్యులుగా 1.చలసాని నరేంద్ర( విశాలాంధ్ర).2. పామర్తి కిషోర్ బాబు(ఆంధ్రజ్యోతి).3.అక్కినేని ప్రసాద్(నాని)4.సుంకర శ్రీనివాస్5.పొలిమేట్ల జాన్ ప్రకాష్.6.కంభం రవి శేఖర్(సూర్య)7.ఆలీ అబ్బాస్(ఆంధ్రప్రభ).కమిటీ సభ్యులను ఎన్నుకొని ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి భాధ్యతలను అప్పగించిన జర్నలిస్టులు. కలం కుటుంబం ఒక్కటై కమిటీ ముందు తమ సమస్యలను వినిపించిన మీడియా ప్రతినిధులు.నూజివీడు మీడియా రంగంలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్ట్ లకు విధి నిర్వహణలో ఎటువంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారం కొరకు ఎల్లవేళలా కృషి చేస్తామని వాగ్దానం చేసిన నూతన కమిటీ సభ్యులు. నూతనంగా ఎన్నికైనా పాత్రికేయ కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వ అధికారులు,రాజకీయ నాయకులు,పట్టణ ప్రముఖులు..

## ప్రజాపాలన దినపత్రిక డైరీ ఆవిష్కరించిన టికే



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతిని ధి : ప్రజా పాలన జాతీయ దినపత్రిక ఆధ్వర్యంలో శుభకృతు తెలుగు సంవత్సరాది సంద ర్భంగా ముద్రించిన డైరీనీ రాజమ హేంద్రవరం వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజ మహేంద్రి విద్యా సంస్థల చైర్మన్ టి కే విశ్వేశ్వరరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టి కే మాట్లాడుతూ , ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచే పత్రికలు నిలుస్తాయని ప్రజా సమస్యలపై కలం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు . జిల్లా స్టాఫ్ రిపోర్టర్ వై రాజేశ్వరరావుఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మిత్రులు రత్నకిషోర్, శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రీట్ బాయ్స్ ఉత్తమ సందేశాత్మక కథాచిత్రం స్ట్రీట్ హీరోయిన్ నేహా



ఒంగోలు ఏప్రిల్ 3 ప్రజాపాలన ప్రతినిధి. ప్రకాశంజిల్లా ఒంగోలులోని స్థానిక మౌర్య కాన్ఫరెన్స్ హాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ వేమూరి మాల్యాద్రి అధ్యక్షతన స్ట్రీట్ బాయ్స్ మీడియా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా స్ట్రీట్ బాయ్స్ హీరోయిన్ నేహ మాట్లాడుతూ తనకు హీరోయిన్ గా అవకాశం రావటం చాలా అదృష్టంగా భావిస్తున్నానని, నిర్మాత రఘురామయ్య చౌదరి మాట్లాడుతూ చిత్రం పోలీస్ బ్యాక్ గ్రౌండ్లో నిర్మిస్తున్నామని మేఘాదిత్య ఆర్ట్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మించామని,ఈ చిత్రం అద్దంకి,చీరాల,ఒంగోలు, హైదరాబాదులో చిత్రీకరిస్తామని తీశామని తెలియజేశారు. దర్శకుడు వెలనాటి మల్లికార్జునరావు మాట్లాడుతూ తాను తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న చిత్రం స్ట్రీట్ బాయ్స్ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 14 వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్, చిత్ర పరిశ్రమ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ఉగాది డైరీ ఆవిష్కరణ



చందోలు 02 ఏప్రిల్ (పిట్టలవానిపాలెం–ప్రజాపాలన) : "ప్రజాపాలన" దినపత్రిక ఉగాది డైరీను శనివారం ఛందోలు పోలీస్ స్టేషన్లో ఎస్ఐ శివయ్య ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షర సమరంలో నిత్యం ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజా సమస్యల పట్ల ముక్కుసూటిగా స్పందిస్తూ ఆ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న పత్రిక ప్రజాపాలన దినపత్రిక అని తెలియజేశారు.ఉగాది – 2022 డైరీని ప్రజాపాలన యాజమాన్యం ఎంతో చూడచక్కగా కనువిందుగా సుందరవనంగా రూపొందించారని ఎస్ఐ శివయ్య కొనియాడారు. డైరీ ఆవిష్కరణలో పిట్టలవానిపాలెం ప్రజాపాలన రిపోర్టర్ షేక్ అదం, పోలీస్ సిబ్బంది ఉన్నారు...

## సమాజ వికాసంలో కవుల పాత్ర ప్రధానమైనది



ఒంగోలు ఏప్రిల్ 3 ప్రజాపాలన ప్రతినిధి. శుభకృత్ నామ ఉగాది సందర్భంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హెూటల్ సింధూర కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ఉగాది పురస్కార సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు లేని సమాజాన్ని ఊహించలేమని, చరిత్రను రేపటితరానికి అందించే చరిత్రకారులని అన్నారు. జిల్లాలోని ప్రముఖ కవులు ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్ జాన్, అక్షర సాహితీ సమితి అధ్యక్షులు ఎం.వి.ఎస్.శాస్త్రి, మత్స్య కవిమిత్ర ఆవుల వేంకట రమణ, అభ్యుదయకవి ఎస్.ఎం.డి.రఫీ, రాష్ట్ర నవ్యాంధ్రుల సంఘం గౌరవాధ్యక్షులు టి.అరుణ, ఆనందమయి సాహితీ సమితి కార్యదర్శి అన్ను విజయకుమారిని ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపి చైర్మన్ శ్రీమతి.మన్నెం ఉషా, బీజేపీ నాయకులు తోగంటి శ్రీనివాసరావు, శివారెడ్డి, బొద్దులూరి ఆంజనేయులు, కంభంపాటి ఆంజనేయలు, మాజీ కౌన్సిలర్ తన్నీరు సురేష్, నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారేళ్ల సుబ్బారావు, సిటిజన్ ఫోరమ్ అధ్యక్షులు కొల్లా మధు, %ప్తశీఎఱ%లీగల్ కార్యదర్శి జాజులా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు చలువాది కృష్ణ, ఆదిల్ ఇన్నోవేషన్ క్లబ్ ఛైర్మన్ షేక్. ఆదిల్,ఆదిల్ ఇన్నోవేషన్ క్లబ్ డైరెక్టర్ షేక్. అహీత్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా జరిగిన కవిసమ్మేళనంలో కవులు వినిపించిన కవితలు ప్రేక్షకులను ఆలోచింపచేశారు.

## పాదయాత్ర చేసుకుంటూ తంబి పుణ్యక్షేత్రానికి దీక్షాపరులు




గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్02: ఉప్పులూరు విచారణ నుండి 09 గ్రామాల ప్రజలు ఏసుప్రభువు మాల ధరించి విశ్వాసంతో ఉప్పులూరు నుంచి ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి లోని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంకు విశ్వాసంతో 2000 మంది గన్నవరం జాతీయ రహదారి మీదుగా పాదయాత్ర చేసుకుంటూ వెళుతున్నారు.

## శిలువ మోస్తూ, క్రైస్తవులపాదయాత్ర



చీరాల, ఏప్రియల్ 3, ప్రజాపాలన : చీరాల, మరియమ్మపేట లోని, సెయింట్ పునీత అంతోని చర్చి ఆధ్వర్యంలో, క్రైస్తవులు శ్రమ దినాల సందరరేగా, చీరాల నుండి కారంచేడు క్యాథలిక్ చర్చి వరకు, శిలువ మోస్తూ క్రైస్తవులు పాదయాత్ర చేశారు.దేవుని కీర్తనలను ఆలపిస్తూ, ఎంతో శ్రద్ధాభక్తితో శిలువ మోస్తూ, తమ ఆరాధనను చాటుకున్నారు. పాదయాత్రలో దేవుని కృపతో ఎటువంటి అలసట లేకుండా, చర్చి వరకు వెళ్ళామని, ఆనందంగా వారు పేర్కొన్నారు.పెద్దసంఖ్యలో క్రైస్తవ సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.

## చందోలులో చలివేంద్రం ఏర్పాటు




చందోలు ఏప్రిల్ 03 (పిట్టలవానిపాలెం – ప్రజాపాలన) : వేసవికాలం దృష్ట్యా ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర రహదారుల డైరెక్టర్ షేక్ అహమ్మద్ హుస్సేన్ కొనియాడారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చందోలు గ్రామవాసి జాకీర్ హుస్సేన్ జ్ఞాపకార్థం వైసిపి నాయకులు ఖాజా ఆధ్వర్యంలో చందోలు ప్రధాన కూడలిలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.ప్రతి ఒక్కరూ చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోని దాహార్తిని తీర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మునీర్, కరీముల్లా, రామిజ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి

చీరాల, ఏప్రియల్ 3, ప్రజాపాలన : నేటి యువతకు నేతాజీ సుభాష్



చంద్రబోస్ స్ఫూర్తి దాయకమని, నేతాజీ సాహసాన్ని ఆయన పట్టుదలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, నేతాజీ సేవాసమితి ప్రతినిధి చుండూరి కృషమూర్తి అన్నారు. ఉగాది పండుగ సందరరే గా నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో, చిన్న రథం సెంటర్లో గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో పవని భాను చంద్ర మూర్తి, ఎం మణి బాబు, అన్నం రాజు సుబ్బారావు, చంద్రశేఖర్, ప్రసాదు, రమేష్,తదితర నేతాజీ సేవాసమితి సభ్యులు,నేతాజీ అభిమానులు, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్మైల్ మథర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ ప్రారంభం



విజయవాడ,ప్రజాపాలన : సామాన్య ప్రజలకు అందుబాటులో కార్పొరేట్ ఆసుపత్రిని నెలకొల్పడం అభినందనీయమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అజిత్ సింగ్ నగర్ కరెంట్ ఆఫీసు సమీపంలోని స్మైల్ మథర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆదర్శవంతంగా నిర్వహిస్తూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. నగర శివారు ప్రాంతమైన సింగ్ నగర్ లో స్త్రీలు, చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా ఈ అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించడం హర్షణీయమని పేర్కొన్నారు. అనంతరం స్మైల్ హాస్పిటల్ డైరక్టర్లు డాక్టర్ అవినాష్, డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ.. అత్యాధునిక వసతులతో ఈ హాస్పిటల్ ను తీర్చిదిద్దామని, అనుభజ్ఞులైన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను అందిస్తామని తెలిపారు. స్మైల్ మథర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ నందు ప్రత్యేక పిల్లల విభాగం అందుబాటులో ఉందని, పిల్లల శస్త్రచికిత్స విభాగాన్ని అత్యంత ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్దామని వివరించారు. డాక్టర్ డి. గౌతమి నేతృత్వంలోని ప్రత్యేక విభాగం నందు ప్రసూతి వైద్య సేవలతో పాటు, స్త్రీలకు సంబంధించిన అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు నాణ్యమైన చికిత్సలను అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు ఎండీ. రుహుల్లా, నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజ రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నందకిషోర్, చిన్నపిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ కిషోర్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ డి. గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు



పర్చూరు, ఏప్రిల్ 3, ప్రజాపాలన : వ్యవసాయ రంగంలో వస్తున్న, సాంకేతిక విప్లవాత్మక మార్పులకనుగుణంగా, అన్నదాతలు సేద్యం వైపు అడుగులు వేసి, అధిక లాభాలు సాధించాలని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. తాటివారిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వీరాంజనేయులు మట్టిగుంట గ్రామంలో, తన మిరప పైరుకు అత్యాధునిక సాంకేతిక పద్ధ తులతో, రూపొందించిన డ్రోన్ తో, పురుగుమందులను పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి రైతులతో కలిసి, ఈ విధానా న్ని పరిశీలించారు. డ్రోన్ పనితీరు, విధానం,తయారీ ఖర్చు తదితరఅంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న కాలానుగుణంగా అన్నదాతలు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలన్నారు. సమయం, ఆదాతో పాటు తక్కువ పెట్టుబడి తో, వ్యవసాయం చేసేలా రైతులు ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. డ్రోన్లు వ్యవసాయంలో రైతులకు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. అత్యంత ఖరీదైనడ్రోన్లతో వ్యవసాయం చేయడం ఖర్చు, కష్టంతో కూడుకున్న పని కావడంతో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా, , నూతన యంత్ర పరికరాలు అందించాలన్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. కష్టకాలంలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. నూతన శుభ కృత నామ సంవత్సరంలో అన్నదాతలకు మేలు జరగాలని ఆకాంక్షించారు. ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, వ్యవసాయం అన్ని విధాలుగా కలసి రావాలని, రైతన్నల ఇంట సిరులు వెల్లివి రియాలన్నారు.రైతులతో పాటు, సకలవృత్తుల ప్రజలు ఆనందంగా ఉండాలన్నారు.అన్నదాత ఆనందంగా ఉంటేనే అన్ని వర్గాల ప్రజలు సంతో షంగా ఉంటారన్నారు. అన్నదాత శ్రేయస్సుకు ప్రభుత్వాలు నడుం బిగించాలన్నారు.

## వైసిపి ఓడింది.. టిడిపి గెలిచింది..



పర్చూరు, ఏప్రియల్ 03, ప్రజాపాలన : అధికారం ఉందన్న అహంకారంతో వైసీపీ ప్రభుత్వం, టిడిపి హయాంలో మంజూరైన దేవాల య ప్రహరీ గోడ నిధులను, న్యాయస్థానాన్ని ఆశ్రయించి, న్యాయపోరాటం ద్వారా నిధులను ఇప్పించి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మరో సారి నియోజక ప్రజల హృదయాల్లో అభిమానాన్ని మరింత పెంచుకున్నారు. వివరాల్లోకి వెళ్తే...., నియోజకవర్గ పరిధిలోని గన్నవరంలో, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో,మంజూరై నిర్మాణం పూర్తయిన, పోలేరమ్మ, అంకమ్మ దేవాలయాల ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధిం చిన, రూ.4 45 లక్షల నిధులను, వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి, ఆ నిధులను ఇప్పించి, దేవాలయ కమిటీకి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందజేశారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుంది అని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశి వరావు అన్నారు. హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ , దేవాలయాల కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, పర్చూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుని, అత్యంత ఘనంగా మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య సేవలను సామాజిక సేవా దృక్పథంతో అందించాలి: ఎమ్మెల్యే ఏలూరి



పర్చూరు, ఏప్రియల్ 3, ప్రజాపాలన : రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలను సామాజిక సేవా దృక్పథంతో అందించాలని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు లో మువ్వా సురేష్ బాబుకు చెంది న, పూజ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలను, ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, లాభాపేక్ష లేకుండా, సామాజిక సేవా దృక్పథంతో, నిజాయితీగా వ్యవహరించాలని, వైద్యులకు ఆయన సూచించారు. మంచి పేరు తెచ్చుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఉగాది పర్వదినాన ప్రారంభించిన, ఈ దంత వైద్యశాల సేవలను ప్రజలు అందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిమాన్విత శ్రీ.జ్యేష్టలక్ష్మి సమేత శ్రీ.శనైశ్చర స్వామి వారి దేవస్థాన నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవాలు



వినుకొండ ఏప్రిల్ 03(ప్రజాపాలనా ప్రతినిధి): మహిమాన్విత శ్రీ.జ్యేష్టలక్ష్మి సమేత శ్రీ.శనైశ్చర స్వామి వారి దేవస్థాన నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం ఈరోజు దేవస్థాన ఆవరణలో అంగరంగ వైభవంగా జరిగింది.,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా వినుకొండ మున్సిపల్ చైర్మన్ శ్రీ.డాక్టర్,షేక్.దస్తగిరి గారు మరియు వారి ధర్మపత్ని షేక్.షకీల గారు,మున్సిపల్ వైస్ ఛైర్మన్,శ్రీ.తెల్లాకుల రాజేష్ ఖన్నా గారు,వినుకొండ మండల ఎంపీపీ,శ్రీ.పగడాల జయశ్రీ-వెంకటరామిరెడ్డి గార్లు,తెలుగు పండిత్,శ్రీ.చిట్టాబత్తిన వెంకట క్రిష్ణయ్య గారితో పాటు ఇంకా కొంతమంది పెద్దలు పాల్గొని కొత్తగా ఎన్నికైన నూతన పాలకమండలి సభ్యులు, కోట కామేశ్వరరావు(ప్రధాన కార్యదర్శి, రెవిళ్ళ శ్రీనివాసరావు(1వ ఉపాధ్యక్షులు, కామిశెట్టి గురువులు(2వ ఉపాధ్యక్షులు, కురాకుల రాము(కార్యదర్శి, తెలగంశెట్టి కేశవబాబు(1వ సహాయ కార్యదర్శి, శాసనాల నాగేశ్వరరావు(2వ సహాయ కార్యదర్శి, బుదాటి సాయిక్రిష్ణ(కోశాధికారి, పుచ్చా తేజ్ కుమార్(1వ సహాయకోశాధికారి, రామడుగు కోటేశ్వరరావు(2వ సహాయకోశాధికారి)తో పాటు 45మంది కార్యవర్గ సభ్యులని ప్రమాణస్వీకారం చేపించారు.

## జగన్ వచ్చాడు... విద్యుత్ షాక్ ఇచ్చాడు...!



చీరాల/పర్చూరు, ఏప్రియల్ 3, ప్రజాపాలన : తెలుగు దేశం పార్టీ అధినేత పిలుపుమేరకు, రాష్ట్ర అధ్యక్షులు సూచనలను అనుసరించి, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి నేతృత్వంలో, బాపట్ల పార్లమెంటు పరిధిలోని, ఆయా నియోజకవర్గాల్లోని, ఆయా మండలాలలో, విద్యుత్ చార్జీలపెంపునకు నిరసనగా, తెలుగుదేశం పార్టీ నాయకులు లాంతర్లు చూపుతూ, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వ హించారు. విద్యుత్ చార్జీలు తగ్గాలంటే.., జగన్ దిగిపోవాల్సిందే...., అంటూ నినాదాలు చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలకు కొవ్వొ త్తుల తో జీవితం కొనసాగించాల్సిన తీరుకి, తీసుకు వచ్చిన ఘనత,



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఎన్నికలప్పుడు ఎన్నో కల్లబొల్లి కబుర్లు చెప్పి, గద్దెనెక్కి , ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ప్రజల సంక్షేమాన్ని పక్కన బెట్టి, అవినీతి, అక్రమాలతో ధనార్జనే ధ్యేయంగా, జగన్ అరాచక పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపునకు, చిన్నగంజాం మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన, విద్యుత్ ఛార్జీలు తగ్గాలంటే..జగన్ రెడ్డి దిగిపోవాల్సిందేనంటూ, యద్దనపూడి మండల కేంద్రంలో ఆందోళన చేశారు. సామాన్యులపై జగన్ సర్కార్ విద్యుత్ పిడుగుకు నిరసనగా, విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా, పర్చూరు లో తెలుగుదేశం పార్టీ నాయకులు, క్రొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ ఛార్జీలు తగ్గాలంటే..జగన్ రెడ్డి దిగిపోవాల్సిందే...అంటూ నినాదాలు చేశారు.జగన్ వచ్చాడు..విద్యుత్ ఛార్జీలతో షాక్ ఇచ్చాడంటూ ..,అధికారంలో ఉండి, వైసీపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాల తీరు పట్ల, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో, పర్చూరు బొమ్మలసెంటర్లో పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పూనూరులో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఆందోళనచేశారు.

## కాంగ్రెస్ పార్టీ కి పూర్వ వైభవం తధ్యం: పిసిసి అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజానాథ్

### రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం - క్షేత్ర స్థాయి నుండి పార్టీ కి పూర్వ వైభవం తెస్తాం



చీరాల, ఏప్రియల్ 3, ప్రజాపాలన : కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో జగన్, అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తధ్యమని, ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు, ప్రణాళిక సిద్ధం చేశామని, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజా నాథ్ చెప్పారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన చీరాల వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రరత్న గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళుల ర్పించారు. తదుపరి మీడియాతో మాట్లాడుతూ, కొన్ని అపోహల కారణంగా, రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ కు దూరమయ్యారని, వాటిని నివృత్తి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకును సుస్థిరం చేయడంతోపాటు, జనాలకు చేరువ అయ్యే కార్యక్రమాలను, వెంటనే చేప డతామని ఆయన తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజావ్యతిరేకవిధానాల కారణంగా, చాలా వేగంగా ప్రజాదరణ కోల్పో యిందని ఆయ న అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని, క్షేత్ర స్థాయి నుండి పార్టీ కి పూర్వ వైభవం తేస్తామని, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి, వర్ధంతి వేడుకలను, ఇక నుండి కాంగ్రెస్ పార్టీ అత్యంత ఘనంగా నిర్వహించబోతోందని, ఇందులో భాగంగానే, తాను చీరాల రావటం జరిగిందని వివరించారు. చీరాల-పేరాల ఉద్యమాన్ని నడిపిన గోపాలకృష్ణయ్య రామదండు గురించి ప్రచారం కల్పించడం, చీరాలలోని ఆయన సమాధిని పునర్నిర్మించడం వంటివి చేస్తామన్నారు. పిసిసి అధికార ప్రతినిధి షేక్ సైదా, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జీ అలీం భాయ్, బాపట్ల పార్లమెంట్ ఇంచార్జ్ అంజిబాబు,ప్రముఖ న్యాయ వాది అంబటి పుష్పరాజ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## బోసుబొమ్మ సెంటర్ లో ఉగాది సంబరాలు



వినుకొండ ఏప్రిల్ 03(ప్రజాపాలన ప్రతినిధి): శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని వినుకొండ పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ లో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా దేవస్థానం నందు కోట వెంకటేశ్వర్లు (లలితా బ్రాండ్) మరియు వాసవి క్లబ్స్ వారి ఆధ్వర్యంలో ప్రముఖ జ్యోతిష్యులు అమరావతి సిద్ధాంతి డాక్టర్ మాచిరాజు వేణుగోపాల్ గారు పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిద్ధాంతి గారు మాట్లాడుతూ ఈ శుభకృత్ నామ సంవత్సరంలో అందరికి మంచి జరుగుతుందనీ అన్ని రకాల విఘ్నాలు తొలగిపోయి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటారని చెప్పారు ఇంకా రాజకీయ పరంగా ప్రభుత్వ పరిపాలన బాగుంటుందని అలాగే వర్షాలు సముద్ధిగా కురుస్తాయని రైతులకు పంటలు బాగా పండుతాయని తెలియజేసారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం వివిధ రాశుల వారికి వారి యొక్క ఆదాయ వ్యయాలు రాశి ఫలాలు తెలియజేసారు. అనంతరం డాక్టర్ మాచిరాజు వేణుగోపాల్ సిద్ధాంతి గారిని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.అనంతరం ఈ కార్యక్రమాన్ని వినుకొండలో ఏర్పాటు చేసిన శ్రీ కోట వెంకటేశ్వర్లు గారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండవ వెంకట కిరణ్ కుమార్, కోట బాలకృష్ణారావు, గజవల్లి నాగ పవన్ కుమార్, తటవర్తి రామ శ్రీనివాసరావు, వాసవి క్లబ్స్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొ నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: ఎమ్మెల్యే కరణం బలరామ్



చీరాల, ఏప్రియల్ 3, ప్రజాపాలన : చీరాల మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణాల యజమానులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాల ని, చీరాల శాసనసభ్యులు కరణం బలరాం పిలుపునిచ్చారు.స్థానిక గడియారస్థంభంసెంటర్లో ఉన్న, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృషయ్య ముని సిపల్ దుకాణాలసముదాయం(షాపింగ్ కాంప్లెక్స్)ని, శుభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా, చీరాల శాసనస భ్యులు కరణం బలరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ, కాంప్లెక్స్ లోని ప్రతి దుకాణదారుడు నాణ్యమైన సేవలను, నిజా యితీగా అందించి, మంచిపేరు తెచ్చుకుని, ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బోనిగల జైసన్ బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, పలువురు కౌన్సిలర్లు, వైసిపి యువనేత కరణం వెంకటేష్ బాబు, లబ్ధిదారులు, నాయకులు,కార్యకర్తలు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## నూతన పల్నాడు జిల్లా ప్రథమ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వై.రవిశంకర్ రెడ్డి ఐపీఎస్





పల్నాడు జిల్లా.ఏప్రిల్ 3.(ప్రజాపాలన ప్రతినిధి) : నరసరావుపేట డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో పోలీస్ సిబ్బంది యొక్క గౌరవ వందనంతో బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ. పల్నాడు జిల్లా పరిస్థితులకు తగిన విధంగా పరిపాలన ఉంటుందని, శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎస్పీ తెలిపారు. నూతన ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న ఎస్పీ పల్నాడు జిల్లా పోలీస్ అధికారులు మర్యాదపూర్వకముగా కలసి,పుష్ప గుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం %చీరా% ప్రాంగణంలో ముస్తాబవుతున్న నూతన జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని, పరిపాలన భవనాల సముదాయాన్ని సందర్శించి, జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. అదే విధంగా ఈ నెల 6వ తేదీన నరసరావుపేటలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్,సభకు వెళ్ళు మార్గాలను పరిశీలించి,ముఖ్యమంత్రి జగన్ పర్యటన దృష్ట్యా పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ (ఏఆర్)రాజు ,డిఎస్పీలు,సీఐలు,ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# ‘ఆచార్య’లోను అదే తరహా పాత్రలో అనసూయ!



అనసూయ ఇప్పుడు ఫుల్ బిజీ. మొన్న మొన్నటివరకూ ఆమె టీవీ కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ వచ్చింది. సినిమాల్లో కాస్త కుదురుకునే వరకూ ఆమె టీవీ కార్యక్రమాలను వదిలి పెట్టలేదు. వాటికి అడ్డురాకూడదనే ఉద్దేశంతోనే అంతకుముందు ఆమె స్పెషల్ సాంగ్స్ చేసుకుంటూ వెళ్లింది. ఆ తరువాత వరుసగా వస్తున్న అవకాశాలు .. తన పై తనకి కుదురుకున్న నమ్మకం కారణంగా ఆమె సినిమాల సంఖ్యను పెంచుకుంటూ వెళుతోంది. ఇప్పుడు ఆమె చేతిలో ఓ డజను సినిమాలు ఉండొచ్చు.అనసూయ అంటే గ్లామర్ .. మంచి హైటూ .. అందుకు తగిన ఆకర్షణీయమైన రూపంతో ఆమె ఇట్టే ఆకట్టుకుంటుంది. తన విలనిజానికి రొమాన్స్ ను జోడించగల అవకాశం ఆమెకి ఉంది. అందువలన ఆమెతో నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్రలను చేయించడానికి దర్శక నిర్మాతలు కూడా ఉత్సాహాన్ని చూపిస్తున్నారు.‘పుష్ప’ సినిమాలో దాక్షాయణిగా ఆమె నటనలోని మరో కోణాన్ని ప్రేక్షకులు చూశారు. ‘పుష్ప 2’లోను ఆమె పాత్ర హైలైట్ కానుంది. ఆమె పాత్ర కి మంచి స్కోప్ ఉండటంతో మరింత పవర్ఫుల్ గా ఆ పాత్రను సుకుమార్ తీర్చిదిద్దుతున్నాడని అంటున్నారు.ఇక చిరంజీవి కథానాయకుడిగా ‘గాడ్ ఫాదర్’ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. మోహన్ రాజా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అనసూయ ఒక కీలకమైన పాత్రను పోషించిందట. నెగెటివ్ షేడ్స్ కలిగినదిగా ఈ పాత్ర కనిపిస్తుందని అంటున్నారు.చాలా కీలకమైన సమయంలో ఉన్నప్పుడు హీరో పాత్రను ఇరికించే ప్రయత్నం చేసే పాత్రను అనసూయ చేసిందని అంటున్నారు. ఈ పాత్ర తనకి చాలా మంచి పేరు తీసుకుని వస్తుందని ఆమె భావిస్తోందట. ఇక ‘ఆచార్య’ సినిమాలోను ఆమె పాత్ర నెగెటివ్ షేడ్స్ తోనే కనిపిస్తుందని అంటున్నారు.చిరంజీవి కథానాయకుడిగా కొరటాల శివ రూపొందించిన ‘ఆచార్య’లో కథానాయికగా కాజల్ కనిపించనుంది. ఇక మరో జంటగా చరణ్ - పూజ హెగ్డే సందడి చేయనున్నారు. ఈ నెల 29న రానున్న ఈ సినిమాలో అనసూయ పాత్ర కూడా చాలా ప్రత్యేకతను .. ప్రాధాన్యతను సంతరించుకుని కనిపిస్తుందని సమాచారం. ఆమె మేకోవర్ చాలా డిఫరెంట్ గా ఉంటుందట. అందువల్లనే ఆమె లుక్ ను రివీల్ చేయలేదని అంటున్నారు. ఈ పాత్ర కోసం ఆమె అందుకున్న పారితోషికం 25 లక్షలని చెప్పుకుంటున్నారు. అనసూయ వెళుతున్న రూట్ చూస్తుంటే ముమ్ముందు ఆమె వరలక్ష్మి శరత్ కుమార్ మాదిరిగా ఎదిగే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

## వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా విశాల్ “సామాన్యుడు”




విశాల్ హీరోగా తు పా శరవణ దర్శకత్వం లో తెరకెక్కిన చిత్రం సామాన్యుడు. ఈ చిత్రం ను విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ మరియు మాలిక్ స్ట్రీమ్ కార్పొరేషన్ పతాకంపై సంయుక్తం గా నిర్మించడం జరిగింది. ఈ చిత్రం థియేటర్ల లో విడుదల అయి ప్రేక్షకులను అలరించిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ చిత్రం ఇప్పుడు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా బుల్లితెర ప్రేక్షకులను అలరించడానికి సిద్ధం అవుతోంది.ఈ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఆదివారం ఏప్రిల్ 10, 2022 న జీ తెలుగు లో ప్రసారం కానుంది. డింపుల్ హాయాతీ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రం కి యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. ఈ చిత్రం బుల్లితెర పై ఎలాంటి రెస్పాన్స్ ను దక్కించుకుంటుందో చూడాలి.

# పాన్ ఇండియా రేస్ లో వెనకబడ్డ అక్కినేని?




పాన్ ఇండియా రేసిజం అంతకంతకు పెరుగుతోంది. టాలీవుడ్ లో అరడజను మంది స్టార్ హీరోలు ఇప్పటికే పాన్ ఇండియా వార్ లో సత్తా చాటుతున్నారు. చిరంజీవి-ప్రభాస్ - రామ్ చరణ్ - బన్ని- ఎన్టీఆర్ ఇప్పటికే భారీ పాన్ ఇండియా సినిమాల్లో నటించారు. ప్రభాస్ .. చరణ్ ప్లానింగ్ పరంగా ఒకడుగు ముందుంటే ఆ తర్వాత రేస్ లోకి బన్ని - ఎన్టీఆర్ చేరారు. సైరా నరసింహారెడ్డి తర్వాత చిరు ఆలోచనలు చూస్తుంటే పాన్ ఇండియా మార్కెట్ ని కొల్లగొట్టాలన్న కసి కనిపిస్తోంది. అందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.అయితే పరిశ్రమలో మరో అగ్ర హీరో అక్కినేని నాగార్జున కానీ ఆయన వారసులు కానీ పాన్ ఇండియా రేస్ లో ఉన్నారా లేరా? అన్నదానికి సరైన జవాబు లేదు. నిజానికి గడిచిన ఏడాది నాగ్ - నాగచైతన్య ప్లానింగ్ అసాధారణంగానే ఉంది. నాగార్జున వరుసగా క్రియేటివ్ స్క్రిప్టులతో ప్రయోగాల్ని ఆపలేదు.బ్రహ్మాస్త్ర లాంటి భారీ పాన్ ఇండియా చిత్రంలోనూ నాగ్ నటించారు. ఈ సినిమా ఈ ఏడాది విడుదల కానుంది. నాగచైతన్య ఇప్పుడు బాలీవుడ్ లో అమీర్ ఖాన్ తో అసోసియేట్ అయ్యి భారీ పాన్ ఇండియా చిత్రంలో నటించాడు. అమీర్- చైతన్య నటించిన లాల్ సింగ్ చద్దా త్వరలో విడుదల కానుంది.అయితే ఈ రెండు సినిమాలు భారీ విజయాలు సాధిస్తే పాన్ ఇండియా సినిమాల్లో నటించిన హీరోలుగా అక్కినేని హీరోలకు పేరొస్తుంది కానీ.. ఆ తర్వాత ఒక ప్రశ్న కూడా అక్కినేని అభిమానుల్లో స్థిరంగా నిలుస్తుంది. ఇప్పటికే పాన్ ఇండియా వార్ లో ప్రముఖ తెలుగు హీరోలు సోలోగా దూసుకుపోతున్నారు.ఈ రేస్ లో చేరాలంటే నాగచైతన్య ప్రయత్నాలు ఎలా ఉండనున్నాయి? అన్నదే క్వశ్చన్ మార్క్. ఇకపోతే చైతన్య స్థిరంగా విజయాలు అందుకుంటూ ప్రస్తుతానికి ప్రాంతీయ మార్కెట్ పైనే దృష్టి సారించాడు. తదుపరి తమిళంలోనూ రాణించే ఆలోచన ఉంది.ప్రస్తుతం వెబ్ సిరీస్ లపైనా దృష్టి సారించి జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని ప్రయోగాలు చేస్తున్నాడు. అక్కడ సక్సెసైతే నెమ్మదిగా పాన్ ఇండియా మేకోవర్ పైనా దృష్టి సారిస్తాడని భావించవచ్చు. మరోవైపు సమంత సైతం హిందీ సినిమాలు చేస్తూ.. పాన్ ఇండియా స్టార్ డమ్ వైపు అడుగులు వేస్తుండడం విశేషం. 2022లో విడుదల కానున్న అనేక భారీ చిత్రాల్లో బ్రహ్మాస్త్ర- లాల్ సింగ్ చద్దా పై భారీ అంచనాలున్నాయి. అలాగే పృథ్వీరాజ్.. లాల్ సింగ్ చద్దా.. విక్రమ్ వేద.. సర్కస్ .. రామ్ సేతు లాంటి భారీ పాన్ ఇండియా చిత్రాలు విడుదలవుతున్నాయి. ఇవన్నీ ఆర్.ఆర్.ఆర్ నింపిన స్ఫూర్తితో విజయం సాధిస్తాయని భారీ వసూళ్లను అందుకుంటాయని ఆశిస్తున్నారు. ఆర్ఆర్ఆర్ ఇప్పటికే 800 కోట్లు వసూలు చేసి 1000 కోట్ల క్లబ్ వైపు ప్రయాణిస్తోంది. ఇక దరిదాపుల్లో వేరొక సినిమా ఇంతటి విజయం సాధిస్తుందా? అన్నది వేచి చూడాలి.

# పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరో పెద్ద ప్రాజెక్ట్.. ఏంటో తెలుసా?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఇటీవల కాలంలో ఎక్కువ సినిమాలను ఒప్పుకుంటూ చాలా బిజీగా గడుపుతున్నారు. 2025 వరకు చాలా బిజీగా ఉండేలా సినిమాలను లైన్ లో పెట్టారు. బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ సినిమా బాహుబలి తర్వాత నుంచి ప్రభాస్ విపరీతమైన క్రేజ్ ను సంపాదించుకున్నారు.ఎక్కువ శాతం పాన్ ఇండియా సినిమాల్లో... బారీ బడ్జెట్ సినిమాల్లోనే నటిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఒక హాలీవుడ్ బడా ప్రొడక్షన్ హౌస్ కూడా ప్రభాస్ తో సినిమా చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ప్రబాస్ కూడా అందుకు ఒప్పుకున్నట్లు టాలీవుడ్ లో టాక్ నడుస్తోంది. దర్శక ధీరుడు రాజమౌళితో బాహుబలి సినిమా చేసిన తర్వాత నుంచి ప్రభాస్ అసలు గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తున్నారు. కరోనా కారణంగా రెండేళ్లు వృధా కావడంతో ఏకంగా మరో మూడేళ్లు అంటే 2025 వరకు బిజీగా ఉండేలా ప్లాన్ చేస్కున్నారు. ఇటీవలే రాధే శ్యామ్ సినిమాతో బిగ్గెస్ట్ డిజాస్టర్ అందుకున్నప్పటికీ... ప్రభాస్ రేంజ్ కొంచెం కూడా తగ్గలేదు.అయితే ఆయన కోసం హాలీవుడ్ సంస్థలు కూడా సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. రాధే శ్యామ్ సినిమా దాదాపు వంద కోట్ల వరకు నష్టాలను మిగిల్చినట్లు సమాచారం. ఆది పురుష్ సినిమా అనంతరం సలార్ ఆ తర్వాత ప్రాజెక్ట్ కే అలాగే స్పిరిట్ సినిమాలను విడుదల చేయనున్నారు. అయితే ఒక దానికొకటి సంబంధం లేకుండా ప్రభాస్ విభిన్నమైన ప్రాజెక్టులను సెలెక్ట్ చేసుకోవడం విశేషం.అయితే ఇక ప్రస్తుతం అందరి దృష్టి ఆది పురుష్ సినిమాపైనే ఉంది. రామాయణం బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాను ఓం రావత్ బిర్లా తెరకెక్కిస్తున్న విషయం అందరికీ తెలిసింది. ఈ సినిమాలో ప్రభాస్ రాముడి పాత్రలో కనిపించబోతున్నారు. తప్పకుండా ఈ మూవీ బాక్సాఫీసు వద్ద సరికొత్త సెన్సేషన్ క్రియేట్ చేస్తుందని అందరూ భావిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.అయితే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ గురించి తెలుసుకున్న ఒక ప్రముఖ హాలీవుడ్ సంస్థ అతనితో సినిమా చేసేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే హాలీవుడ్ ఇండస్ట్రీలోనే అతి పెద్ద సూపర్ హీరో ఫిలిమ్స్ నిర్మించినటువంటి యూనివర్సల్ స్టూడియోస్ ప్రభాస్ తో కూడా ఒక బిగ్ బడ్జెట్ సినిమాను ప్లాన్ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇది వరకే హీరోతో చర్చలు కూడా జరిపినట్లు సమాచారం. అయితే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని విషయాలు తెల్సుకోవాలంటే ఇంకా కొన్నాళ్లు ఆగాల్సిందే.

# నాని “అంటే సుందరానికీ” ఫస్ట్ సింగిల్‌పై అప్డేట్..!




న్యాచురల్ స్టార్ నాని వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ “అంటే సుందరానికీ”. మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్న ఈ సినిమాలో నాని సరసన మలయాళ బ్యూటీ నజ్రియా ఫహద్ నటిస్తుంది. ఈ సినిమాను జూన్ 10వ తేదీన విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. వివేక్ సాగర్ సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలకు ముహూర్తాన్ని ఫిక్స్ చేశారు.ఈ నెల 6వ తేదీ సాయంత్రం 6:03 నిమిషాలకు ‘పంచె కట్టు’ అంటూ సాగే ఫస్టు సింగిల్‌ను విడుదల చేయనున్నారు. ఇంతవరకూ ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతూ వెళ్లాయి. రీసెంట్‌గానే ఈ సినిమా నుంచి నాని క్యారెక్టర్‌ను రివీల్ చేస్తూ ఓ టీజర్‌ని వదిలింది చిత్రబృందం. ఈ టీజర్ కూడా ప్రేక్షకులకు విపరీతంగా ఆకట్టుకుంది.

# ఏడేళ్ల నుంచి నందులు లేవు సింహాలు లేవ్!-మురళీ మోహన్



అవార్డులు ఎంతో ప్రోత్సాహకం. ఆర్టిస్టులకు కానీ సినీపరిశ్రమలో 24 శాఖల ప్రతిభావంతులకు ప్రతియేటా అవార్డులిచ్చే గొప్ప సంస్కృతి ఉండేది. కానీ ఇప్పుడు అంతా మారింది. అవార్డులను పట్టించుకునే సన్నివేశం లేదు. ప్రభుత్వాలు రాజకీయనాయకులకు అంత తీరిక కూడా లేదు. ముఖ్యంగా రాష్ట్రం రెండుగా విభజితమయ్యాక సన్నివేశం మరీ తీసికట్టుగా మారింది. అసలు ప్రభుత్వం తరపున ఇచ్చే అవార్డుల గురించి మాట మాత్రం అయినా ప్రస్థావన లేదు.అప్పట్లో ఘనంగా ప్రకటించారు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం నంది అవార్డులను కొనసాగిస్తుంటే.. తెలంగాణలో సింహా అవార్డులు ఇస్తామని పేర్కొన్నారు. కానీ ఇప్పటికీ అవార్డులకు టికాణా లేకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సినీపరిశ్రమ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చెప్పేందుకు తాజాగా మురళీ మోహన్ చేసిన వ్యాఖ్యలు పరిశీలించాలి.ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఎప్పుడు దయ కలుగుతుందో అవార్డులు ఇవ్వడానికి.. అంటూ ప్రసాద్ ల్యాబ్ లో ఉగాది సినిమా పురస్కారాల వేడుకలో మురళీ మోహన్ వ్యాఖ్యానించారు. 24 విభాగాలకు చెందిన సినీ ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేస్తూ సినీప్రముఖులే ఒక కార్యక్రమం జరుపుకున్నారు మినహా ప్రభుత్వాలు పట్టించుకున్నదే లేదు. ముఖ్య అతిథులుగా హాజరైన బ్రహ్మానందం- సి.కళ్యాణ్ - మురళీమోహన్ ప్రభృతుల్లో దీనిపై విస్తృత చర్చ సాగింది.సినీనటులకు అవార్డులు ఆక్సిజన్ లాంటివి అని ప్రభుత్వాలు సహకరించాలని మరోసారి మురళీమోహన్ గోడు వెల్లబోసుకున్నారు.నంది అవార్డుల ప్రదానోత్సవాన్ని ప్రభుత్వాలు పక్కన పెట్టాయని కూడా మురళీమోహన్ వ్యాఖ్యానించారు. ఏడేళ్ల నుంచి నంది అవార్డులు ఇవ్వడం లేదని అన్నారు. ప్రైవేటు సంస్థలు నటీనటులకు అవార్డులు ఇస్తున్నాయి తప్ప ప్రభుత్వాలకు తీరిక లేనేలేదని అన్నారు.స్టూడియో సెక్టార్ నుంచి రమేష్ ప్రసాద్ కు ఉగాది పురస్కారాన్ని ఈ ఉగాది పురస్కాల్లో ప్రదానం చేశారు. మురళీమోహన్ .. బ్రహ్మానందం చేతుల మీదుగా రమేష్ ప్రసాద్ కి ఈ పురస్కారం దక్కింది. ఇతర విభాగాలకు అవార్డులను అందించారు.

అప్పట్లో ఘనంగా ప్రకటించారు కానీ!

ఏపీ తెలంగాణ డివైడ్ అనంతరం సినీపరిశ్రమ పరిస్థితి ఆగమ్యగోచరమే అయ్యింది. పరిశ్రమ హైదరాబాద్ లోనే ఉంటుందా లేక ఏపీకి తరలివెళుతుందా? అన్నదానిపై బోలెడంత చర్చ సాగింది. అయితే ఆరంభం తెలంగాణ ప్రభుత్వం సినీపరిశ్రమకు తోడ్పాటునిస్తామని నమ్మబలికింది. ఏపీకి నందులు ఉన్నట్టే తెలంగాణ ప్రభుత్వం సింహా పేరుతో అవార్డులు ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఈ అంశంపై ఓ కమిటీని నియమించి రివ్యూలు చేయించింది. నాటి ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి నేతృత్వంలో సినీ ప్రముఖులు.. ప్రభుత్వ అధికారులు.. నిపుణుల కమిటీ ఆరు నెలలు విస్తృతస్థాయిలో చర్చించి ఈ నిర్ణయం ప్రకటించారు. మొత్తం నలభై విభాగాల్లో ఈ అవార్డులు ఉండాలని కమిటీ సూచించారు. లక్షల్లో అవార్డులకు ప్రైజ్ మనీనికి కూడా ఫిక్స్ చేశారు. అయితే అనంతరం ప్రకటనలు ఘనం.. పనులు శూన్యం అన్న చందంగా సన్నివేశం మారింది. అటువైపు ఆంధ్రప్రదేశ్ లోనూ జగన్ ప్రభుత్వం అవార్డుల వ్యవహారంపై చూసీ చూడనట్టే వ్యవహరించడంపైనా సినీపరిశ్రమలో అసంతృప్తి అలానే ఉంది.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్

BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com